మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 102 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



## ఫిరాయింపుల పాలనపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదు

**- మంత్రి శ్రీధర్ బాబు**



మంథని, (ప్రజా మంటలు): ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీ నేతలకు లేదని రాష్ట్రానికి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్‌కు చాలా తేడా ఉందన్నారు. గతంలో మా పార్టీ ఎమ్మెల్యేలను భయపెట్టి బీఆర్ఎస్ చేర్చుకుంటే.. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మా పాలన నచ్చి కాంగ్రెస్ పార్టీకి లోకి వస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

# సమర్ధవంతంగా హైడ్రా

- ప్రజలకు విస్తృత సేవలందించాలి
- ఈ దిశగా బలమైన వ్యవస్థగా రూపుదిద్దుకోవాలి
- ఇందుకోసం సంబంధిత శాఖలన్నీ సమన్వయం చేసుకోవాలి
- నాలాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై కఠిన చర్యలు
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు




హైదరాబాద్, (ప్రజా మంటలు): హైదరాబాద్ సిటీ విస్తరణకు అనుగుణంగా ప్రజలకు విస్తృత సేవలను అందించేలా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) రూపుదిద్దు కోవాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. జాతీయ విపత్తుల నిర్వహణ చట్టానికి అనుగుణంగా ఈ కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. హైడ్రా వ్యవస్థాగత నిర్మాణం, విధి విధానాలపై మరింత అధ్యయనం చేసి కసరత్తు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. జీహెచ్ఎంసీతో పాటు, హెచ్ఎండిఏ, వాటర్ బోర్డు, విజిలెన్స్, ట్రాఫిక్, విద్యుత్తు, పోలీస్ విభాగాలను సమన్వయం చేసుకొని మరింత సమర్థంగా హైడ్రా పని చేసేలా ఉండాలని అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. ఇప్పుడున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ విభాగాన్ని అందుకు అనుగుణంగా పునర్ వ్యవస్థీకరించాలని ఆదేశించారు. కొత్త విభాగంలో ఏయే స్థాయి అధికారులుండాలి.. ఎంత మంది సిబ్బంది ఉండాలి.. ఏయే

విబాగాలపై వీరిని డిప్యుటేషన్పై తీసుకోవాలి.. అనే అంశాలపై స్పష్టమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. జీహెచ్ఎంసీతో పాటు హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు వరకు 2 వేల కిలోమీటర్ల పరిధిలో హైడ్రా పని చేయాల్సి ఉంటుందని, పని విభజనకు వీలుగా సిటీలో ఇప్పుడున్న జోన్ల తరహాలో భౌగోళిక పరిధిని నిర్దేశించాలని సీఎం సూచించారు. అవసరమైతే హైడ్రాకు ప్రత్యేక నిధులు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. ఈ అసెంబ్లీ మిగతా 2లో..

## 16న కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం భేటీ


- ప్రజాపాలన, ధరణిపైనా చర్చ
- లా అండ్ ఆర్డర్, డ్రగ్స్ అరికట్టడంపై సమీక్ష
- విద్య, వైద్యం, వ్యవసాయానికీ ప్రాధాన్యం
- వన మహోత్సవం, మహిళాశక్తి క్యాంటీన్ల ఏర్పాటు



హైదరాబాద్, (ప్రజా మంటలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 16న సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి తొమ్మిది అంశాలతో కూడిన ఎజెండా ఖరారయ్యింది. మిగతా 2లో..

# భారాసకు మరో షాక్

**- కాంగ్రెస్‌లో చేరిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్**



హైదరాబాద్,(ప్రజా మంటలు): రాజేంద్రనగర్ భారాస ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వచ్చిన ఆయన సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచరులు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డితో పలువురు నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ నిందితులకు ఎదురుదెబ్బ

**- బెయిల్ పిటిషన్లు కొట్టేసిన నాంపల్లి కోర్టు**



హైదరాబాద్, (ప్రజా మంటలు): ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితులకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. నాంపల్లి కోర్టులో నిందితులు దాఖలుచేసిన మ్యాండేటరీ బెయిల్ పిటిషన్లను న్యాయస్థానం కొట్టివేసింది. ఏ2 ప్రణీత్‌రావు, ఏ3 తిరుపతన్న, ఏ4 భుజంగరావు, ఏ5 రాధాకిషన్‌రావులకు కస్టడీ పూర్తయిందని, ఇప్పటివరకు ఛార్జిషీట్ నమోదు కానందున వారికి బెయిల్ ఇచ్చే అధికారం కోర్టుకు ఉందని నిందితుల తరపు న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. వారి వాదనలపై అభ్యంతరం వ్యక్తం చేసిన పోలీసులు.. ఛార్జిషీట్ దాఖలు చేశామని, దాన్ని తిప్పి పంపినంత మాత్రాన అసలు దాఖలు చేయనట్టు కాదు అన్నారు. గురువారం ఇరువైపులా వాదనలు ముగియగా.. న్యాయమూర్తి ఇవాళ తీర్పు వెలువరించారు.

## విశ్వాస పరీక్షలో ప్రచండ ఓటమి

కాఠ్‌మాండూ (ప్రజా మంటలు): అస్థిర రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన నేపాల్‌లో మరోసారి కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రభుత్వంపై పెట్టిన అవిశ్వాస తీర్మానంలో ప్రస్తుత ప్రధాని పుష్ప కమల్ దహాల్ 'ప్రచండ' ఓటమిపాలయ్యారు. ప్రభుత్వానికి మద్దతుగా 63 మంది నిలవగా, వ్యతిరేకంగా 194 ఓట్లు వచ్చాయి. 275 సీట్లు కలిగిన నేపాల్ పార్లమెంటులో.. ప్రభుత్వ ఏర్పాటుకు 138 ఓట్ల మెజార్టీ అవసరం. మాజీ ప్రధాని కె.పి.శర్మ ఓలి నేతృత్వంలోని పార్టీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవడంతో ప్రస్తుత ప్రభుత్వం కూలిపోయినట్లయ్యింది. నేపాల్ ప్రధానిగా డిసెంబర్ 25, 2022లో పుష్ప కమల్ దహాల్ 'ప్రచండ' బాధ్యతలు చేపట్టారు. మాజీ ప్రధాని ఓలీ నేతృత్వంలోని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ యూనిఫైడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్ తో కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ప్రచండ ఇప్పటికే మూడుసార్లు అవిశ్వాసం ఎదుర్కొన్నారు. అయితే, నేపాలీ కాంగ్రెస్‌తో ముందస్తుగా చేసుకున్న అధికార బదలాయింపు ఒప్పందం ప్రకారం ఆయన ప్రధానమంత్రి పదవి నుంచి తప్పుకోవాల్సి ఉంది. కానీ, అందుకు ప్రచండ నిరాకరించడంతో అవిశ్వాసం అనివార్యమైంది. మిగతా 2లో..

# నైనీ గనిలో సింగరేణి బొగ్గు తవ్వకాలకు ఒడిశా ఓకే

- సంస్థకు సహకరిస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి వినతిపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాంజీని సానుకూల స్పందన

ఒడిశా (ప్రజా మంటలు): ఒడిశాలోని నైనీ వద్ద సింగరేణి సంస్థ చేపట్టిన బొగ్గు గని ప్రాజెక్టులో తవ్వకాలు చేపట్టేందుకు సహకరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాంజీని కోరారు. దీనిపై మిగతా 2లో..




# సుప్రీంకోర్టులో కేజ్రీవాల్ కు ఊరట

**- లిక్కర్ కేసులో మధ్యంతర బెయిల్ మంజూరు**



న్యూఢిల్లీ (ప్రజా మంటలు): సుప్రీంకోర్టులో కేజ్రీవాల్ కు ఊరట లభించింది. ఆయనకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేస్తూ తీర్పును వెలువరించింది. ఢిల్లీ లిక్కర్ ఈడీ మనీలాండరింగ్ కేసులో ఆయనకు ధర్మాసనం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే, బెయిల్ కేసులో అరెస్టయినందున ఆయన తిహార్ జైల్లోనే ఉండనున్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో తన అరెస్ట్ అక్రమం అని కేజ్రీవాల్ వేసిన పిటిషన్ ను విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసినట్టు జస్టిస్ సంజీవ్ కన్నా ధర్మాసనం తెలిపింది. గత నెల 27వ తేదీన ఢిల్లీ లిక్కర్ కేసులో కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు మిగతా 2లో..

## ప్రజా నాడి




## హైదరాబాద్ 'టి స్క్వేర్'

- రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీ సమీపంలో నిర్మాణం
- రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్, (ప్రజా మంటలు): రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీ సమీపంలో భారీ ప్లాజా నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర పరిశ్రమలు మౌలిక సదుపాయాల సంస్థ ఆధ్వర్యంలో టి స్క్వేర్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. ఈమేరకు టీజీఐఐసీ టెండర్లు ఆహ్వానించింది. మధ్య, దిగువ మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు, స్థానిక ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించేలా టి స్క్వేర్ నిర్మాణం ఉండాలని నిర్ణయించారు. రోజువారి పనులతో క్షణం తీరిక లేకుండా ఉండే వారికి టి స్క్వేర్‌లో జరిగే ఈవెంట్లతో ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని భావిస్తున్నారు.

# భారత్‌లో జనాభా విస్ఫోటనం

**- 2060 నాటికి దేశ జనాభా 170 కోట్లకు చేరిక - ఐరాస**



ఐరాస (ప్రజా మంటలు): భారత జనాభా 2060 నాటికి 170 కోట్ల వద్ద గరిష్ఠానికి చేరుతుందని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. తర్వాత 12 శాతం తగ్గుదల రేటుతో క్రమంగా దిగొస్తుందని తెలిపింది. అయితే, ఈ శతాబ్దం మొత్తం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ కొనసాగుతుందని పేర్కొంది. ఈమేరకు 'వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్స్ 2024' పేరిట గురువారం ఓ నివేదిక విడుదల చేసింది. వచ్చే 50–60 ఏళ్లలో ప్రపంచ జనాభా 1030 కోట్ల వద్ద గరిష్ఠానికి చేరుతుందని ఐరాస అంచనా వేసింది. అక్కడినుంచి దిగొస్తూ ఈ శతాబ్దం చివరకు 1020 కోట్లకు తగ్గుతుందని తెలిపింది. అత్యధిక జనాభా కలిగిన దేశంగా గత ఏడాది చైనాను దాటేసిన భారత్ 2100 సంవత్సరం వరకు అదే స్థానంలో ఉంటుందని పేర్కొంది. 2024లో మన దేశ జనాభా 145 కోట్లని అంచనా వేసింది. 2054 నాటికి అది 169 కోట్లకు చేరుతుందని తెలిపింది. ఆ తర్వాత క్రమంగా 150 కోట్లకు తగ్గుతుందని పేర్కొంది. ప్రస్తుతం చైనా జనాభా 141 కోట్లని.. 2054 నాటికి 121 కోట్లకు తగ్గుతుందని ఐరాస నివేదిక తెలిపింది. 2100 నాటికి అది 63.3 కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. 2024–54 మధ్య ఆ దేశ మిగతా 2లో..

## నేపాల్‌లో ఘోర ప్రమాదం

- రెండు బస్సులపై విరిగిపడ్డ కొండచరియలు
- 65 మంది నదిలో పడి గల్లంతు!

ఖాట్మండ్ (ప్రజా మంటలు): నేపాల్‌లో శుక్రవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటుచేసుకొంది. నారాయణఘాట్–ముగ్‌లింగ్ జాతీయ రహదారిపై తెల్లవారుజామున 3.30 సమయంలో కొండ చరియలు విరిగి పడ్డాయి. ఆ సమయంలో భారీగా వర్షం కూడా కురుస్తోంది. దీంతో అదే మార్గంలో దాదాపు 65 మందికి పైగా ప్రయాణికులతో వెళ్తున్న రెండు బస్సులపై కొండచరియలు పడడంతో ఆ రెండు బస్సులు పక్కనే ఉన్న త్రిశూన్ నదిలో పడ్డాయి. గల్లంతైన వారిలో ఏడుగురు భారతీయులు కూడా ఉన్నట్లు సమాచారం. వీరు ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలొస్తున్నాయి. కానీ,ఎటువంటి అధికారిక ధ్రువీకరణ రాలేదు. మరో బస్సుపై కొండచరియలు విరిగిపడటంతో డ్రైవర్ మృతి చెందాడు. 24 మంది ప్రయాణికుల తో ఓ బస్సు కాఠ్‌మాండూ వెళుతోంది. మరో బస్సులో 41 మంది ఉన్నట్లు గుర్తించారు. వీటిని గణపతి డీలక్స్, ఏంజెల్ బస్సులుగా మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

## సమర్ధవంతంగా హైడ్రా

సమావేశాల్లోగా ముసాయిదా తయారు చేయాలని చెప్పారు. హైడ్రా ఏర్పాటు, సంబంధిత విధివిధానాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సచివాలయంలో సమీక్ష చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలీ, జీహెచ్ఎంసీ ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు. విపత్తుల నిర్వహణతో పాటుగా ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, చెరువులు, నాలాల కబ్జాలకు అడ్డుకట్ట వేయటం, ఆక్రమణలను తొలిగించటం, అక్రమ నిర్మాణాలు, నిబంధనలను పాటించని ఫ్లెక్సీలు, హోర్డింగ్లు, ప్రకటనల తొలిగింపు, ట్రాఫిక్ నిర్వహణ, తాగునీరు, విద్యుత్తు సరఫరాలో హైడ్రా కీలకంగా వ్యవహరించేలా విధులు అప్పగించాలని సీఎం చెప్పారు. హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, డిజాస్టర్ మేనేజ్?మెంట్?, మున్సిపల్ విభాగాల మధ్య ఎప్పటికప్పుడు సమన్వయం ఉండాలని అధికారులను అప్రమత్తం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న అనధికారిక హోర్డింగ్స్, ఫ్లెక్సీలు తొలగింపు, అపరాధ రుసుము వసూలు బాధ్యతను హైడ్రాకు బదలాయించాలని అన్నారు. నాలాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల విషయంలో నిబంధనలు కఠినంగా ఉండేలా అధ్యయనం చేయాలని సూచించారు.

## 16న కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం భేటీ

24 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ సమావేశాలకు ప్రాధాన్యత సంతరించుకుంది. తొమ్మిది అంశాలే ఎజెండాగా నిర్వహించబోయే ఈ సమావేశంలో క్షేత్ర స్థాయి పరిస్థితులపై కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం ఆరా తీయనున్నారు. ఇందులో ప్రజాపాలన దరఖాస్తుల గ్రౌండింగ్, అమలు ప్రస్తుత పరిస్తితిపై చర్చించనున్నారు. దీంతో పాటు ధరణిపై ప్రభుత్వం సబ్ కమిటీ వేసిన విషయం తెలిసిందే. ఈ సందర్బంగా వస్తున్న అభ్యంతరాలు.. వాటికి పరిష్కార మార్గాలపైనా సమావేశం చర్చించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ నడుస్తున్న నేపథ్యంలో విత్తనాలు, ఎరువుల సమస్యలపైనా డిస్కస్ చేయనున్నారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైనందున పాఠశాలలు, గురుకులాల్లోని అంశాలపై చర్చ జరగనుంది. సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు, ఎపిడమిక్ సెల్ ల పనితీరు... సర్కారు దవాఖానాల్లో వైద్య సేవల తీరు.. మందుల అందుబాటు తదితర అంశాలపై సీఎం చర్చిస్తారని తెలుస్తోంది. వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్న రేవంత్ సర్కారు ఆరోగ్య శ్రీ పథకం కింద గత ప్రభుత్వ హయాంలో ఉన్న రూ. 5లక్షల సాయాన్ని 10 లక్షలకు పెంచిన విషయం తెలిసిందే. ఆరోగ్య శ్రీ సేవలపైనా సీఎం ఆరా తీయనున్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పై ఎస్పీలతో సీఎం చర్చించనున్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపైనా ఆరా తీయనున్నారు. ముఖ్యంగా డ్రగ్స్ కంట్రోల్ పై ప్రభుత్వం దృష్టి సారించిన విషయం తెలిసిందే.. వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం ఆరా తీయనున్నారు. రాష్ట్రం నుంచి డ్రగ్స్ మహమ్మారిని తరిమేందుకు ఏం చేయాలనే అంశాన్ని ఎస్పీలతో చర్చించే అవకాశం ఉంది. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నది. అయినప్పటికీ సైబర్ నేరగాళ్లు తమ స్టైల్ ను మార్చి లూఠీ చేస్తున్నారు. వీటికి చెక్ పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించే అవకాశం ఉంది. ఏది ఏమైనా బదిలీలు, పదోన్నతుల తర్వాత.. బడ్జెట్ సమావేశాలకు ముందస్తుగా జరుగుతున్న ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది.

## నైనీ గనిలో సింగరేణి బొగ్గు తవ్వకాలకు ఒడిశా ఓకే

స్పందించిన ఒడిశా సీఎం నైని బొగ్గు గనుల తవ్వకానికి పూర్తిగా సహకరిస్తాని భరోసా ఇవ్వడంతో పాటు, తగిన చర్యలు చేపట్టాలని ఆ రాష్ట్ర ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నైనీ బ్లాక్‌లో సింగరేణి కార్యకలాపాల ప్రారంభానికి సంబంధించి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని కోరేందుకు శుక్రవారం భట్టి విక్రమార్క.. అధికారుల బృందంతో కలిసి ఒడిశా సీఎంను ఆ రాష్ట్ర సచివాలయంలో కలిశారు.ఒడిశా ముఖ్యమంత్రికి డిప్యూటీ సీఎం భట్టి.. సింగరేణికి బొగ్గు బ్లాకుల ఆవశ్యకతను వివరించారు. 2017లోనే సింగరేణికి నైనీ గనులను కేటాయించారని తెలిపారు. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ విషయాలకు సంబంధించి గత ప్రభుత్వంలో నాటి బొగ్గు గనుల మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి తాడిచర్ల బ్లాక్, నైనీ బ్లాక్‌లకు సంబంధించిన అడ్డంకులను తొలగించాల్సిందిగా విజ్ఞప్తి చేసినట్టు వివరించారు. నైనీ బ్లాకులో గనుల తవ్వకానికి పారిశ్రామిక, పర్యావరణ అనుమతులు సైతం వచ్చాయని తెలిపారు. అటవీ, ప్రైవేటు భూములను సింగరేణికి బదలాయించాల్సిన అంశం పెండింగ్‌లో ఉందని, ఈ సమస్య పరిష్కారం అయితే సింగరేణి తవ్వకాలను ప్రారంభిస్తుందని చెప్పారు. నైనీ బ్లాక్‌లో తవ్వకాలు చేపట్టడం వల్ల ఒడిశా యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి, పన్నుల రూపంలో రూ.600 కోట్ల వరకు ఒడిశా సర్కార్‌కు ఆదాయం సమకూరుతుందని వివరించారు. దీంతో భూముల బదలాయింపు, విద్యుత్తు, రహదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అక్కడి ఉన్నతాధికారులకు ఒడిశా సీఎం ఆదేశాలు జారీ చేశారు.

## భారత్‌లో జనాభా విస్పోటనం

జనాభాలో భారీ ఎత్తున తగ్గుదల నమోదవుతుందని తెలిపింది. తర్వాత జపాన్, రష్యాలోనూ జనాభా వేగంగా దిగొస్తుందని పేర్కొంది. సంతాన సాఫల్యత రేటు గణనీయంగా పడిపోవడమే ఇందుకు కారణమమని వివరించింది. చైనాలో సగటున ఒక్కో మహిళ తమ జీవితకాలంలో ఒకరికి మాత్రమే జన్మనిస్తున్నట్లు తెలిపింది.సంతాన సాఫల్యత రేటు 2.1 ఉండాలని.. అప్పుడే ప్రస్తుత జనాభా అలాగే కొనసాగుతుందని ఐరాసలో జనాభా విభాగాధిపతి జాన్ విల్మోత్ తెలిపారు. 1.8 లేదా 1.5 కంటే తక్కువకు చేరితే జనాభా గణనీయంగా పడిపోతుందని పేర్కొన్నారు. చైనా సహా మరికొన్ని దేశాల్లో ప్రస్తుతం అదే జరుగుతోందని వివరించారు.

## సుప్రీంకోర్టులో కేజీవ్రాల్ కు ఊరట

చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం తిహార్ జైల్లో కేజీవ్రాల్ ఉన్నారు. ఢిల్లీ మద్యం విధానం మనీలాండరింగ్ కేసులో ఏప్రిల్ 9న ఢిల్లీ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను కేజీవ్రాల్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్త నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కేజీవ్రాల్ పిటిషన్ పై విచారణ జరిపింది. కేజీవ్రాల్, ఈడీ వాదనల అనంతరం మే 17న తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్ చేసింది. ఆ తరవాత జూన్ 20న కేజీవ్రాల్‌కి రౌస్ అవెన్యూ కోర్టు సాధారణ బెయిల్ మంజూరు చేయగా... మరుసటి రోజే ఢిల్లీ హైకోర్టు స్టే ఇచ్చింది.

## నేపాల్‌లో ఘోర ప్రమాదం

గుర్తించారు. వీటిల్లో గణపతి డీలక్స్‌కు చెందినదిగా భావిస్తున్న బస్సు నుంచి ముగ్గురు ప్రయాణికులు తప్పించుకొన్నారు. బస్సు ప్రమాదానికి గురికాగానే వారు దానిలోనుంచి బయటకు దూకేసినట్లు కాఠ్‌మాండూ పోస్టు పేర్కొంది. అదే మార్గంలో మరోచోట కూడా బస్సుపై కొండచరియ విరిగిపడటంతో దాని డ్రైవర్ తీవ్రంగా గాయపడి మృతి చెందారు. ఈ బస్సు బుట్వాల్ నుంచి కాఠ్మాండూకు వెళుతోంది. మృతుడిని మేఘ్‌నాథ్‌గా గుర్తించారు. ఈ ఘటనపై నేపాల్ ప్రధాని పుష్పకమల్ దహల్ విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఏజెన్సీలు అక్కడ బాధితుల గాలింపునకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ దేశ సాయుధ దళాలు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి.

## విశ్వాస పరీక్షలో ప్రచండ ఓటమి

నేపాలీ కాంగ్రెస్ 89 సీట్లతో అతిపెద్ద పార్టీగా నిలవగా, సీపీఎన్-యుఎంఎల్‌కు 78 మంది సభ్యుల బలం ఉంది. వీరిద్దరూ కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నారు. తదుపరి ప్రధానిగా ఓలి బాధ్యతలు చేపట్టేందుకు నేపాలీ కాంగ్రెస్ ఇప్పటికే అంగీకరించినట్లు సమాచారం. మొత్తంగా నేపాల్‌లో గడిచిన పదహారేళ్లలో 13 ప్రభుత్వాలు మారడం అక్కడి రాజకీయ అస్థిరతకు నిదర్శనం.





## వారాహి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కుంకుమార్చనలు

జగిత్యాల జులై 12 (ప్రజా మంటలు)
జిల్లా కేంద్రం లోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం గీతా భవన్ లో వారాహి నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని, సభా పతి బ్రహ్మశ్రీ తిగుళ్ళ విషు చే ఎంతో అట్ట హా సంగా జరుగుతున్న సౌందర్య లహరి ప్రవచనం శ్రోతలను ఎంతగానో ఆకట్టుకుంటుంది. అందులో భాగంగా శుక్రవారం ఆశాడ మాసం మొదటి శుక్రవారం సాముహిక కుంకుమ పూజలు జరిగాయి. 500మంది మహిళలు కుంకుమ పూజలో పాల్గొన్నారు.నిర్వాహకులు వచ్చిన భక్తులు అందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్య క్రమంలో కార్య క్రమ నిర్వాహకులు గంప రజని,నార్ల రజని, పాత రాధ తో బాటు సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం భక్తులు, మాతలు పాల్గొన్నారు.

## విద్యుత్ భవనాన్ని ప్రారంభించిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



గుంతకల్లు జులై 12 (ప్రజా మంటలు)
గుంతకల్లు లో పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మినారాయణ రూపాయలు 2. 20 కోట్ల తో నిర్మించిన విద్యుత్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రైలు గేట్ ల వల్ల నిరంతరం ప్రజలు ఇబ్బందులు వున్నాయని బ్రిడ్జీలు నిర్మించాలని, ట్రాక్ కు ఇరుపక్కలా కాంపౌండ్ గోడ కట్టడం వల్ల విద్యార్థులు పాఠశాలకు వెళ్లే మార్గం లేక మూడు కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తుందని అన్నారు. వెంటనే ఎంపీ ఆయా ప్రాంతాలను సందర్శించి సికింద్రాబాద్ జనరల్ మేనేజర్ కు ఫోన్ ద్వారా తెలియజేసి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రపోజల్స్ కూడా అతి త్వరలోనే పంపడం జరుగుతుంది అని స్థానికు లకు భరోసా ఇచ్చారు. ఈ కార్ర్యమంలో అధికారులు, స్థానిక నాయకులతో పాటు గుమ్మనూరు నారాయణస్వామి,మణికంఠ, ముష్టురు తిమ్మప్ప, ముష్ఠురు భాస్కర్, మాజీ కౌన్సిలర్ అంజి, మొదలగు వారు పాల్గొన్నారు.

# రైతులకు తాము ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం

**ప్రజాధనం సద్వినియోగం కోసమే ప్రజాభిప్రాయ సేకరణ**

**ప్రజాభిప్రాయాలను అసెంబ్లీలో చర్చించి పథకం అమలు**

**రైతులను రెచ్చగొట్టే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి**

**అర్హులైన రైతులకే పథకాలు అందాలన్నదే మా లక్ష్యం**

**వనపర్తి అభిప్రాయ సేకరణలో మంత్రుల స్పష్టీకరణ**

వనపర్తి,జూలై12 (ప్రజా మంటలు):
రైతులకు తాము ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని రెవెన్యూ,సమాచార మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజాధనం సద్వినియోగం చేయాలనే రైతు భరోసాపై అభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. రైతుభరోసాను అసలు సిసలు రైతులకే అమలు చేస్తామని అన్నారు. శుక్రవారం వనపర్తిలో రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ కోసం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతో కూడిన సబ్‌కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ 'కొందరు నాయకులు, ప్రతిపక్షాలు రైతుభరోసాపై రైతులను రెచ్చగొట్టాలని చూస్తున్నాయి. దీన్ని తిప్పి కొట్టాలి. ప్రతి పక్షాలు కూడా మంచి సూచనలు చేస్తే బేషజాలు లేకుండా వాటిని స్వీకరిస్తాం. రైతుభరోసా స్కీమ్‌పై ఎలాంటి అపోహలు వద్దని, ప్రజాభిప్రాయాలను అసెంబ్లీలో చర్చించి స్కీమ్ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ రంగాన్ని, రైతులను కాపాడుకునేందుకే ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తుందని అన్నారు. అందరి అభిప్రాయాలు తెలుసుకునేందుకే రైతు భరోసా సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని రైతుల సంక్షేమం దృష్ట్యా రైతు భరోసా కార్యక్రమాన్ని నిర్దిష్టంగా అమలు చేయాలని లక్ష్యంతో అందరి అభిప్రాయం, సలహాలు, సూచనలు తీసుకొని అన్ని జిల్లాలను క్రోడీకరించి చట్టసభలలో ప్రస్తావనకు తీసుకువచ్చి ఈ అంశాలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వనరులు, సంపదను ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి వినియోగిస్తామని, ప్రజలు, రైతులు ప్రత్యక్షంగా, పరోక్షంగా తమ కష్టార్జితం నుంచి చెల్లించిన పన్ను, వివిధ రంగాల ద్వారా ప్రభుత్వానికి సమకూర్చిన ఆదాయం ద్వారా ప్రజల కష్టానికి న్యాయం చేస్తామని అన్నారు. రైతు భరోసా పథకం ద్వారా రైతు సంక్షేమం కోసం స్పష్టమైన కార్యచరణతో ముందుకు వెళదామని అన్నారు. రైతు భరోసా పథకంలో రైతులకు లబ్ది చేకూరే విధంగా రైతులు, శాస్త్ర వేత్తలు, వివిధ రంగాలలో నిపుణులు, వివిధ వర్గాల వారి అందరి అభిప్రాయాలు, సూచనలు తీసుకొని రైతు సంక్షేమం దిశగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు, మేధావుల అభిప్రాయం మేరకే రైతుభరోసా అమలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే సాగుకు పనికిరాని భూములకు రూ. 25 వేల కోట్ల రైతుబంధు ఇచ్చి నిధులు దుర్వినియోగం చేశారన్నారు. సీఎం మనసులో రైతుల పంటలకు బీమా ఇచ్చే ఆలోచన ఉందన్నారు. మద్దతుధర అందించి రైతులకు మేలు చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. ప్రజల ఆలోచనను పరిగణలోకి తీసుకుని రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రజా రంజకంగా పాలన సాగించడం జరుగుతుందని, చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే విధంగా రైతు భరోసా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ క్షేత్రంలో కష్టాలకు ఓర్చి, చెమటోడ్చి పంట పండించే రైతుకు ప్రాధాన్యత నివ్వడం జరుగుతుందని తెలిపారు. రైతు భరోసా అమలు చేయడంలో ప్రతి ఒక్కరి అభిప్రాయానికి ప్రాధాన్యత ఇస్తామని, అందరి అభిప్రాయాలను క్రోడీకరించి సముచిత ప్రణాళిక ద్వారా రైతు సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం నుండి ఏ కార్యక్రమం చేపట్టిన ప్రజా క్షేత్రంలో సూచనలు, సలహాలు తీసుకొని ప్రజల సమ్మతితో అమలు చేయడం జరుగుతుందని, ప్రజాధనాన్ని ప్రజలకు ప్రతినిధులుగా న్యాయ బద్ధంగా అర్హత గల ప్రతి ఒక్కరికి అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.దాదాపు 96 శాతం ఉన్న సన్న, చిన్న కారు రైతుల అభివృద్ధి దిశగా ప్రభుత్వం పని చేస్తుందని, వ్యవసాయంపై జీవనం సాగిస్తున్న రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రజలు అందించిన సలహాలు, సూచనలు, అభిప్రాయాలను అసెంబ్లీలో అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రస్తావించి వారి అభిప్రాయాలను సైతం స్వీకరిస్తామని తెలిపారు. వ్యవసాయ భూమిలో కాలు పెట్టి చెమటోడ్చి సాగు చేసే రైతులకు న్యాయం జరిగేలా విధివిధానాలు రూపొందిస్తామని, నిబంధనల ప్రకారం అర్హత కలిగిన సాగు రైతులకు పట్టాలు అందించడంపై ప్రభుత్వం ఆలోచిస్తుందని అన్నారు.

## పట్టణంలో గుంతలు పడ్డ రోడ్ల మరమ్మత్తులు, చేపట్టండి

### -హిందు వాహిని ప్రాంత సంపర్గా ప్రముఖ్ వేముల సంతోష్

జగిత్యాల జూలై 12 (ప్రజా మంటలు)
పట్టణంలోని టవర్ సర్కిల్ మార్కెట్ రోడ్ లో గుంతలతో ఉన్న రోడ్లను మరమ్మత్తులు చేపట్టాలని శుక్రవారం ఉదయం 11 గంటలకు జగిత్యాల మున్సిపల్ కమిషనర్ చైర్ పర్సన్ అడ్వల జ్యోతి కి వినతి పత్రాన్ని సమర్పించిన హిందు వాహిని నాయకులుఈ సందర్భంగా వేముల సంతోష్ మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలోని టవర్ సర్కిల్ లో నాలుగు వైపులా పాత సిసి రోడ్లు లో ఉన్నటువంటి గుంతలు వలన పట్టణ ప్రజలకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి, చిన్న పిల్లలు స్కూల్లు సమయంలో గుంతలతో, వర్షం నీళ్ళు నిల్వ ఉండడంతో వాహనదారులు ప్రజలు ప్రమాదాల గురవుతున్నారని, అలాగే రాబోయే వినాయక చవితి మరియు దుర్గా నవరాత్రి సందర్భంగా ఊరేగింపులు మరియు నిమజ్జనా కార్యక్రమలు ఉంటాయి. వీటన్నిటి దృష్ట్యా పెట్టుకొని నాలుగు వైపులా రోడ్లు తాత్కాలిక మనమత్తులు కాకుండా పూర్తిస్థాయి లో కొత్త రోడ్లు వేయించాలని మున్సిపల్ కమిషనర్, చైర్ పర్సన్ కోరారు. ఈ కార్యక్రమంలో కైలాసపతి, విష్ణు, హరీష్, మహేష్, రాకేష్, ప్రతాప్, దశరతం తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్ష్య పదవికి హుజురాబాద్ వాసి నామినేషన్

భీమదేవరపల్లి జూలై 12 (ప్రజామంటలు) : హుజూరాబాద్ పట్టణానికి చెందిన అడ్వకేట్ ఎస్. వై థామస్ శుక్రవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధక్ష్య పదవికి నామినేషన్ దాఖలు చేశారు. గత 13 ఏళ్ల నుండి కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఎన్ఎస్ యుఐలో కాలేజ్ ప్రెసిడెంట్ నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పలు జిల్లాలకు ఇంచార్జ్ గా సేవలు అందించారు. రాష్ట్ర యువతలో మంచి గుర్తింపు పొందిన యువ నాయకుడికి సముచిత స్థానం కల్పిస్తే, రాష్ట్ర నలుమూలలో పార్టీ బలోపేతానికి కృషి చేయడమే కాకుండా, విద్యార్థి సమస్యల పైన నిరంతర పోరాటం చేస్తున్న నాయకుడికి ప్రార్ధన తీస్తే




బాగుంటుందని యువత కోరుకుంటున్నారు.

## రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతి పత్రం

**- సాధారణ బదిలీలు చేపట్టినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు**

**- రాష్ట్ర ఉపాధ్యక్షులు భూక్య నరసింహా నాయక్**

**భీమదేవరపల్లి జూలై 12 (ప్రజామంటలు) :** తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండమల్ల రవి, ఉపాధ్యక్షులు భూక్య నరసింహా నాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై తెలంగాణ ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సాధారణ బదిలీలు చేపట్టినందుకు గాను రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆఫీస్ సబార్డినేట్ నుండి సీనియర్ సహాయకుల వరకు జిల్లా స్థాయిలోనే బదిలీలు చేయాలన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులు, రికార్డ్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ గా మండలంలో పదోన్నతి పొంది, అదే మండలంలో పనిచేస్తున్న వారిని వెంటనే పక్క డివిజన్ లేదా పక్క జిల్లాలకు బదిలీ చేపట్టాలన్నారు. అలాగే దూరప్రాంతాలకు వెళ్లిన వారిని పక్క జిల్లా లేదా పక్క డివిజన్ కు బదిలీ చేయాలన్నారు. మూడు సంవత్సరాల పైబడి ఒకే చోట పనిచేస్తున్న నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు సాధారణ బదిలీలు చేపట్టాలన్నారు. పెండింగ్లో ఉన్న ఐదు డిఎల్ ను వెంటనే మంజూరు చేయాలని, పెండింగ్ లో ఉన్న మెడికల్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని అన్నారు. ప్రతి మండలంలో ఇద్దరు గిర్ధవర్ లు విధులు నిర్వహించే విధంగా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.



వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను పునరుద్ధరించాలని, గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. రెవెన్యూ నాన్ గెజిటెడ్ ఉద్యోగులను బదిలీ చేసే ముందు ఖాళీల జాబితాను ముందే ప్రకటించాలని, ఉద్యోగులకు ఈ హెచ్ ఎస్ పథకము కింద అన్ని కార్పొరేట్ హాస్పిటల్స్ లో పరిమితి లేని వైద్యం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి పట్టల విజయ్ బాబు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి లు పెండ్లి రంజిత్, ఎండి గౌస్, హన్మకొండ జిల్లా అధ్యక్షులు మారుపట్ల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి మేకల రమేష్ తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

# చెత్తతో సంపదను సృష్టిద్దాం

**ప్లాస్టిక్ భూతాన్ని తరిమేస్తేనే మనుగడ**

**పంచాయితీల్లో చెత్తతో అనేక ఉపయోగాలి**

**నీటి కాలుష్యాన్ని అరికట్టాలన్నదే సంకల్పం**

**పిఠాపురం నుంచే ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తాం**

**అధికారులతో సమీక్షలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

అమరావతి,జూలై12 (ప్రజా మంటలు):
చెత్త నుంచి కూడా సంపద సృష్టించి ఆదాయం పెంచుకునేలా మార్గాలు అన్వేషించాలని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ సూచించారు. ఇదే లక్ష్యంతో సాలిడ్ అండ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్మెంట్ ప్రాజెక్ట్ చేపట్టినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. తాడేపల్లిలోని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో గురువారం ఆ శాఖపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. తొలిసారి కార్యాలయానికి వచ్చిన ఆయనకు అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను పవన్ సందర్శించారు. అనంతరం ఎస్ఎల్ఆర్ఎం వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. దీనిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన అధికారులు.. భీమవరం, పిఠాపురం, గొల్లప్రోలు లో ఈ ప్రాజెక్ట్ అమలు చేస్తున్నట్లు వివరించారు. డ్రైనేజ్ టు డైమండ్ అనే కాన్సెప్ట్‌తో ఈ ప్రాజెక్టును రూపొందించారని ఎల్ఎల్ఆర్ఎం రిసోర్స్ ప్రతినిధి శ్రీనివాసన్ పేర్కొన్నారు. 12 గంటల్లో చెత్తను కలెక్ట్ చేయగలిగితే అది సంపదే అవతుందని.. పనికి రాని చెత్త వేరే అవసరాలకు సంపదగా మారుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. పిఠాపురంలో తొలిసారిగా ఎస్ఎల్ఆర్ఎం ప్రాజెక్ట్ చేపడతు న్నామని.. శ్రీనివాసన్ గత రెండు దశాబ్దాలుగా ఈ ప్రాజెక్టుపై పని చేస్తున్నారని చెప్పారు. ప్రజలు సైతం ఈ ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దీనిపై అవగాహన కల్పించేందుకు మాస్టర్ ట్రైనర్స్‌ను సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. 'పంట కాల్వ కనిపిస్తే కొందరు డంపింగా యార్డుగా మార్చేస్తున్నారు. పంచభూతాల్లో నీరు ఉంది. నీటిని మనం పూజలకు ఉపయోగిస్తాం. అలాంటి జలాన్ని కాలుష్యం కాకుండా కాపాడుకోవాలి. ప్రస్తుతం పర్యావరణానికి అతి పెద్ద సమస్య



ప్లాస్టిక్. ప్లాస్టిక్, చెత్తా చెదారంతో ఇబ్బందులు వస్తున్నాయి. మనం గోవులను పూజిస్తాం. ప్లాస్టిక్ కవర్లు తినడం వల్ల ఆవులు చనిపోవడం బాధాకరం. ఎస్ఎల్ఆర్ఎం ప్రాజెక్టులో ఈ ఇబ్బందులు తొలుగుతాయి. ఈ ప్రాజెక్టును మా కార్యాలయంలో.. మా పార్టీ ఆఫీసులో ప్రారంభిస్తాం. ఈ ప్రాజెక్టును అమలు చేయగలిగితే పంచాయతీలు, మున్సిపాల్టీలకు ఆదాయం వస్తుందని పవన్ వివరించారు. మన జీవితంలో చెత్త ఒక భాగంగా మారిందని అన్నారు. మన దేశం నదులు, సంప్రదాయాలు, పూజలకు విలువ ఇస్తామని.. కానీ నదుల సంరక్షణకు చర్యలు తీసుకోబోమన్నారు. పంట కాలువలను డంపింగ్ యార్డులుగా మారుస్తున్నారని.. ప్లాస్టిక్ కవర్లు ఎక్కడ పడితే అక్కడ పారేస్తున్నారని పవన్ పేర్కొన్నారు. వాటిని తిని గోవులు చనిపోతున్నాయన్నారు. గోవులను పూజించడమే కాదు.. వాటి బాగు కూడా చూడాలి. మనకి పనికిరాని వస్తువులతో సంపద సృష్టించవచ్చు. చెత్తను ఊడ్చి పడేయటం వరకే... తరువాత ఏమిటి అని ఆలోచన చేయడం లేదు. పిఠాపురంలో తొలుత ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నాం. రోజుకు రెండు సార్లు చెత్త కలెక్ట్ చేసి.. కొత్త సంపద సృష్టిస్తాం. ప్రజలు కూడా దీనిని బాధ్యత తీసుకుని సహకరించాలని అన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా పిఠాపురంలో అన్ని కాలనీల్లో అమలు చేస్తాం. మాస్టర్ ట్రైనర్స్‌ను ముందు రెడీ చేసి.. వాళ్ల ద్వారా రాష్ట్రం మొత్తం శిక్షణ ఇస్తాం. ఇది వ్యక్తి తో మొదలైనా... వ్యవస్థ మొత్తం అమలు చేయాలి. నా పార్టీ ఆఫీస్, నా క్యాంపు ఆఫీస్, నా నియోజకవర్గంలో నేను మొదలు పెడతా. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా కూడా కొన్ని మార్పులు తీసుకు వస్తాం. పంచాయతీల ద్వారా మోటివేషన్ తీసుకు వస్తాం. 101 గ్రామ పంచాయతీల్లో చెత్తతో రూ.2600 కోట్లు ఆదాయం సమకూరింది. రెండున్నర లక్షల మందికి ఉపాధి అవకాశాలు వచ్చాయి. స్వచ్ఛాంధ్ర ద్వారా దీనిని ప్రజల్లోకి తీసుకెళతాం. ప్రజలంతా దీనిపై అవగాహన పెంచుకోవాలి. చెత్త ద్వారా వచ్చే సంపదను ఆయా కార్మికులకు కేటాయిస్తాం. బ్లీచింగ్ పౌడర్‌కే పంచాయతీల్లో డబ్బులు లేని పరిస్థితి. పంచాయతీకి నిధులు సమకూర్చే సవాల్‌ను స్వీకరించి ముందుకు సాగుతాం. గ్రామాల్లో రోడ్డు వెంట కొబ్బరి చెట్లు పెంచడం ద్వారా కొంత ఆదాయం సమకూర్చుకుంటాం. పంచాయతీలను అనేక కారణాలతో నిర్వీర్యం చేశారు. సమూలంగా ప్రక్షాళన జరగాలి. స్వయం సమృద్ధిగా పంచాయతీలు ఎదగాలి. అల్లావుద్దీన్ అద్భుత దీపంలా అన్ని పరిష్కారాలు ఒకేసారి అయిపోవు. ఈ ప్రాజెక్టును ముందు అమలు చేసి.. ఫలితాల చూసి.. అన్నిచోట్ల అమలు చేస్తాం అని అన్నారు. దీనికి కమ్మిట్మెంట్ ఉండే లీడర్ షిప్ ఉంటేనే ఇది సాధ్యం. పిఠాపురంలో 54 పంచాయతీ ల్లో మేము చేసేది చేయగా.. యన్ఆర్ఐలు ముందుకు వస్తే వారి సాయం తీసుకుంటాం అని పవన్ పేర్కొన్నారు. సర్వీస్ అంటే ఎవరూ రారు.. చెత్తతో సంపద వస్తుంది అంటేనే ముందుకు వస్తారు. అన్ని అనర్థాలకు ఒకే ఐఏయస్ కారణం. ఏ సమీక్ష చేసినా... ఆయనే మూల కారణం అంటున్నారు. ఆయన ఇప్పుడు సర్వీసులో లేరు. ఎవరిని బాధ్యులను చేయాలి, నిధులు ఎలా రికవరీ చేయాలి? కేవలం కేసులు పెట్టి చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. గత ప్రభుత్వం పంచాయతీలకు రాష్ట్ర వాటా ఇవ్వలేదు. కేంద్రం కూడా నమ్మకం పోయి నిధులు ఆపేసింది. 70:30 నిధులు ఇస్తే పని అయ్యేది.. అది జరగలేదు. రకరకాల పేర్లు చెప్పి నిధులు మొత్తం మళ్లించారు. ముందు ఖర్చు పెట్టండి, తరువాత బిల్లు ఇస్తాం అని నమ్మబలికారు. డబ్బులు వచ్చినా.. రోడ్లు వేసిన కాంట్రాక్టర్‌లకు గత ప్రభుత్వం ఇవ్వలేదు. అన్ని వ్యవస్థ ల్లో, పథకాల్లో ఇటువంటి ఛాలెంజ్‌లు ఉన్నాయి. వీటిని పెట్టుకుని వెంటనే అన్నీ చేయాలంటే మాకు సాధ్యం కాదు కదా' అని పవన్ పేర్కొన్నారు.



## రఘురామపై కస్టోడియల్ టార్చర్

**హత్యాయత్నం చేసినట్లు పేర్కొన్న ఎమ్మెల్యే**

**ఆనాడు ఎంపిగా ఉన్నప్పుడు వేధింపులు**

**సీఐడీ డీజీ సునీల్‌కుమార్, జగన్‌లపై ఫిర్యాదు**

**రఘురామ ఫిర్యాదుపై గుంటూరులో కేసు నమోదు**

గుంటూరు,జూలై12 (ప్రజా మంటలు):
మాజీ సీఎం జగన్, ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ సహా పలువురిపై కేసు నమోదైంది. తెదేపా ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఫిర్యాదు మేరకు గుంటూరులోని నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో రాజద్రోహం చట్టం కింద తనను అరెస్టు చేసి వేధించారని రఘురామ పేర్కొన్నారు. మాజీ సీఎం జగన్‌తో పాటు అప్పటి సీఐడీ డీజీ పీవీ సునీల్‌కుమార్, మరికొందరు అధికారులపై ఫిర్యాదు చేశారు. కస్టడీకి తీసుకున్న సమయంలో తనపై దాడి చేశారని ఆరోపించారు. దాంతోపాటు హత్యాయత్నం చేశారని ఫిర్యాదులో తెలిపారు. తప్పుడు నివేదికలు ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో సునీల్‌కుమార్ (ఏ1), ఇంటెలిజెన్స్ మాజీ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు (ఏ2), జగన్ (ఏ3),అప్పటి సీఐడీ ఏఎస్పీ విజయ్‌పాల్ (ఏ4), గుంటూరు జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి (ఏ5)పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. హత్యాయత్నం, తప్పుడు నివేదికలు, భయభ్రాంతులకు గురిచేయడం తదితర అంశాలకు సంబంధించిన పలు సెక్షన్లు పెట్టారు. వీటిలో బెయిల్‌బుల్, నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్లు కూడా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో సునీల్ సీఐడీ డీజీగా పని చేశారు. అప్పుడు ఎంపీగా ఉన్న రఘురామ కృష్ణంరాజును కస్టడీకి తీసుకున్న సమయంలో కొట్టడమే కాకుండా హత్యాయత్నం చేశారని, చిత్ర హింసలు పెట్టారని ఫిర్యాదు చేశారు. దీంతో మాజీ సీఐడీ సునీల్‌తోపాటు పలువురు అధికారులపై పోలీసులు పలు సెక్షన్లకింద కేసు నమోదు చేశారు. జగన్ ప్రభుత్వ హాయంలో తనపై జరిగిన కస్టోడియల్ టార్చర్‌పై గుంటూరు ఎస్పీకి రఘురామకృష్ణంరాజు ఫిర్యాదు చేశారు. తనపై పోలీస్ కస్టడీలో జరిగిన హత్యాయత్నానికి బాధ్యులుగా సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్, ఇంటిలిజెన్స్ చీఫ్ సీతారామంజ నేయులు, మాజీ సీఎం వైఎస్ జగ్మోహన్ రెడ్డి, అప్పటి సీఐడీ, అడిషనల్ ఎస్పీ విజయ్ పాల్‌లపై కేసు నమోదైంది. తనకు అయిన గాయాలపై కోర్టుకు గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి తప్పుడు నివేదిక ఇచ్చారని ఫిర్యాదు చేశారు. జగన్ రెడ్డిని విమర్శిస్తే తనను చంపేస్తానని సునీల్ కుమార్ తనను బెదిరించారని కూడా రఘురామ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు గుంటూ జిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడులు ముమ్మరం

**నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం**

హైదరాబాద్, జూలై12 (ప్రజా మంటలు):
మార్కెట్లో రోజు రోజుకూ నకిలీ ఉత్పత్తులు పెరిగిపోతున్నాయి. ఆహార పదార్థాలను నకిలీ చేసి అమ్ముతున్న వారిపై పోలీసులు, ఫుడ్ స్టేఫ్టీ అధికారులు చర్యలు తీసుకుంటు న్నప్పటికీ ఏదో ఒక చోట నకిలీలు తయారవుతూనే ఉన్నాయి. నకిలీ ఉత్పత్తుల తయారీపై అధికారులు కొరడా ఝుళిపించినప్పటికీ తయరీదారులు వెనక్కి తగ్గడంలేదు. ఎంతో రహస్యంగా నకీలీ ఉత్పత్తులను తయారు చేసి మార్కట్‌లోకి విడుదల చేస్తున్నారు. తాజాగా... బుద్వేల్‌లోని గ్రీన్ సిటీలో గోప్యంగా తయారు చేస్తున్న నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ ఫ్యాక్టరీపై సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు దాడి చేశారు. దాదాపు రూ.15 లక్షల విలువ గల 7.3 టన్నుల పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అమీర్ నిజాన్ అనే వ్యక్తి... అప్న ఎంటర్ప్రైసెస్ పేరుతో ఫ్యాక్టరీని నిర్వహిస్తున్నారు. పక్కా సమాచారంతో అక్కడకు చేరుకున్న ఎస్వోటీ పోలీసులు నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా సింథటిక్ కలర్స్, యాసిడ్స్, కెమికల్ వాటర్ వాడుతున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఫుడ్ సేఫ్టీ అధికారి పరీక్షలు జరుపుతున్నట్లు సమాచారం.

## తిరుమలలో కూలిన చెట్టుకొమ్మ

**మహిళా భక్తురాలికి తీవ్ర గాయాలు**

తిరుమల జూలై12 (ప్రజా మంటలు):
అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు కొలువైన తిరుమల శ్రీవారి సన్నిధిలో ఓ మహిళకు ఊహించని ఘటన ఎదురైంది..! రెప్పపాటులో ఆమెకు చావైతే తప్పింది కానీ వెన్నుముక మాత్రం విరిగిపోయింది..! తిరుమల శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్న అనంతరం అక్కడే ఉన్న ఇతర ఆలయాలను సైతం భక్తులు దర్శించుకుంటూ ఉంటారు. తిరుమల కొండపై జాపాలి తీర్థం ఉంది. అది ప్రకృతి రమణీయతకు ఆనవాలుగా ఉంటుంది. అక్కడ శ్రీ ఆంజనేయ స్వామి కొలువై ఉంటాడు. ఆయనను దర్శించుకుంటే మనకు కష్టాలను ఎదుర్కొనే శక్తి వస్తుందని నమ్మకం. క్రమంలోనే తిరుమలకు వెళ్లినవారు తప్పని సరిగా జాపాలి తీర్థానికి వెళుతుంటారు. ఎప్పటి మాదిరిగానే భక్తులు జాపాలి తీర్థానికి వెళ్లారు. అక్కడ స్వామివారి దర్శనానికి వెళు తుండగా.. పై నుంచి చెట్టు కొమ్మ విరిగి మహిళపై పడింది. ఈ ఊహించని ఈ ఘటనతో సదరు మహిళ కుప్పకూలిపోయింది. దీంతో ఆమె వెన్నుముకకు తీవ్ర గాయమైనట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



## కాన్వాయ్ ఆపి వినతుల స్వీకరణ

**పార్టీ కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తా - సిఎం చంద్రబాబు నాయుడు వెల్లడి**

అమరావతి,జూలై12 (ప్రజా మంటలు):
ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక చంద్రబాబు నాయుడు ఏపీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వీలైనంత త్వరగా నెరవేర్చేలా ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఏపీని అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్లేందుకు చంద్రబాబు నిత్యం శ్రమిస్తున్నారు. అధికారులతో సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తూ సీఎం బిజీబిజీగా గడుపుతున్నారు. అలాగే ఎక్కడికక్కడ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటిని త్వరిగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ



క్రమంలో శుక్రవారం ఉండవల్లి నివాసం నుంచి సెక్రటేరియట్‌కు వెళ్తుండగా అక్కడ ఉన్న ప్రజలను చూసి ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్వాయ్ ఆపారు. నివాసం నుంచి కాన్వాయ్ బయటకు వచ్చిన వెంటనే రోడ్డుపై వినతి పత్రాలతో జనం నిలబడి ఉన్నారు. వారిని కార్‌లో నుంచి చూసిన చంద్రబాబు ముందుకు వెళ్తూ కాన్వాయ్‌లో తన కార్ ఆపివేయించారు. అనంతరం కారు దిగి... అందరి వద్దకు వెళ్లి వినతి పత్రాలు తీసుకుని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరిస్తానని ప్రజలకు చంద్రబాబు హామీ ఇచ్చారు. అలాగే పార్టీ ఆఫీస్‌లో వినతి పత్రాలు తీసుకునేందుకు కొత్త వ్యవస్థను ఏర్పాటు చేశామని అక్కడకు వెళ్లి కూడా ఇవ్వొచ్చని ఈ సందర్భంగా ప్రజలకు చంద్రబాబు చెప్పారు. తమను చూసి సీఎం చంద్రబాబు కారు దిగి వినతి పత్రాలు తీసుకోవడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## భూములిస్తే అనంతలో ఎయిర్‌పోర్టు

**సమీక్షలో వెల్లడించిన మంత్రి రామ్మోహన్ నాయుడు**

అమరావతి,జూలై12 (ప్రజా మంటలు):
అనంతపురంలో అనువైన భూమి చూపితే విమానాశ్రయం ఏర్పాటుపై అధ్యయనం మొదలుపెడతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఉద్యాన ఉత్పత్తుల ఎగుమతుల కోసం ఇక్కడ ఎయిర్‌పోర్టు ఏర్పాటుచేయాలని రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, స్థానిక ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి ఇటీవల చేసిన విజ్ఞప్తిపై ఆయన స్పందించారు. విమానాశ్రయానికి కావాల్సిన భూమి చూపితే తదుపరి కార్యాచరణ చేపడతామ న్నారు. ఇందుకు 1,200 ఎకరాలు అవసరమవుతాయని పేర్కొన్నారు. గన్నవరం విమానాశ్రయం అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎయిర్ పోర్ట్ అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గన్నవరం ఎయిర్ పోర్ట్ అంతర్జాతీయ టెర్మినల్ పనులు గత ప్రభుత్వం హయాంలో అటకెక్కాయి.. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలు అధికారంలో ఉండి విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయకపోవడం దారుణమని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్ టెర్మినల్ అభివఅద్ధి పనులను సంవత్సరంలోపు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని ఎంపీ కేశినేని చిన్ని వెల్లడించారు. ఇక, కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడుతో మాట్లాడుతూ.. గన్నవరం ఎయిర్ పోర్టు అభివృద్ధికి కృషి చేసి



రాష్ట్రంలో నెంబర్ వన్ స్థాయిలో నిలుపుతామన్నారు. విమానాశ్రయం అభివృద్ధికి అను విధాలుగా కృషి చేస్తాను అని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో పనులను ఎయిర్ పోర్టుల్లో సందర్శించి సమీక్షించారు.. పనుల్లో జాప్యం ఉంటే కాంట్రాక్టర్లను మార్చాలి.. అంతేగాని గత వైసీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాలు ఎయిర్ పోర్ట్ పనులు నిలిపి వేసి చోద్యం చూశారని కేంద్రమంత్రి మండిపడ్డారు. మా ఎన్డీయే ప్రభుత్వంలో కేవలం 9 నెలలోనే ఎయిర్ పోర్ట్ ను అంతర్జాతీయ టెర్మినల్స్ ను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. ఎయిర్ పోర్టులో అంతర్జాతీయ టెర్మినల్ పనులు సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశర చేశారు.

## సొంత జిల్లా అభివృద్ధిలోనూ భాగస్వామినవుతా

**అనకాపల్లి ఎంపి సిఎం రమేశ్ హామీ**

కడప, జూలై12 (ప్రజా మంటలు):
అనకాపల్లి ఎంపీగా ఎన్నికై కడపకు రావడం చాలా ఆనందం గా ఉందని బీజేపీ ఎంపీ సీఎం రమేష్ అన్నారు. శుక్రవారం కడపకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాయల సీమ నుంచి వచ్చి అనకాపల్లిలో ఎలా రాజకీయాలు చేస్తారని వైసీపీ నేతలు ప్రశించారని, జగన్ తల్లి విజయలక్ష్మి ఓటమి పాలయ్యారని, మీరెంత అంటూ తనను అపహాస్యం చేశారని అన్నారు. విమర్శకుల నోరు మూయించేలా అనకాపల్లి ప్రజలు తనను గెలిపించి.. వారికి బుద్ధి చెప్పారన్నారు.వైసీపీ నేతల్లా తాను దౌర్జన్యాలు చేయలేదని.. కడప జిల్లాకు ఉన్న మంచి పేరు చేడగొట్టారని సీఎం రమేష్ మండిపడ్డారు. మంచి పాలన అందించి కడప జిల్లాకు మంచి పేరు తెస్తానన్నారు. అనకాపల్లితో పాటు సొంత జిల్లా కడపను మర్చిపోనన్నారు. కడప జిల్లా వాసుల రుణం తీర్చుకుంటానని.. అనకాపల్లిలో ఉన్నా కడపను అశ్రద్ధ వహించేది లేదని స్పష్టం చేశారు. పేదలకు ఇళ్ళు కట్టాలనే ద్యాస వైసీపీకి లేదని, మొదటి నుంచి నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, డబ్బులు గుంజారని ఆయన ఆరోపించారు. కడప స్టీల్ ఎలాంట్ కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు. మొన్ననే స్టీల్‌ప్లాంట్ విషయంపై చంద్రబాబుతో చర్చించామని, యుద్ధప్రాతిపదికన స్టీల్ ఎ÷-లాంట్ పూర్తి చేస్తామని చెప్పారు. మాజీ సీఎం జగన్ స్టీల్ ఎలాంట్ స్థలం మార్చారే తప్ప సాధించిందేమి లేదని ఎంపీ సీఎం రమేష్ ఎద్దేవా చేశారు.



# పర్యావరణం కోసం..ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం !

ప్లాస్టిక్ కరోనా కన్నా డేంజర్. అది మన జీవితాలను ఎంతగా నలిపేస్తుందో ఎవ్వరూ గమనించడం లేదు. అన్ని వ్యాధులకు ప్లాస్టిక్ కారణమని, ముఖ్యంగా క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులకు కూడా అదే కారణం అవుతోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అలాగే పర్యావరణం దెబ్బతీయడంలో ప్లాస్టిక్ ముందు టోంది. అయినా మనలో మార్పు రావడం లేదు. పెరుగుతున్న సాంకేతికత, ఆధునిక సౌకర్యాల కారణంగా ప్లాస్టిక్ వాడకం ఎక్కువవుతోంది. ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వాలు పెద్దగా శ్రద్ధ పెట్టడం లేదు. వాడుతున్న ప్రజలు కూడా అంతకు మించి అన్నట్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో సులువుగా వస్తువుల తెచ్చుకోవడం కారణంగా దీనికి ఆదరణ పెరిగింది. అందుకే మనం వాడి పడేస్తున్న ప్లాస్టిక్ గుట్టలుగుట్టలుగా రోజూ మనవీధుల్లో దర్శనమిస్తోంది. చివరకు నదులు, సముద్రాలను కూడా వదలకుండా అందులో ప్లాస్టిక్ వ్యర్థాలను పడేస్తున్నాం. ఈ క్రమంలో ప్లాస్టిక్ నిషేధం గురించి ప్రతి ఒక్కకూ ఆలోచించాలి. ప్లాస్టిక్‌ను వాడకుండా ప్రభుత్వమే నిషేధించాలి. ప్లాస్టిక్ బ్యాగులు తయారు చేయకుండా నిషేధం విధించాలి. ఏటా జూలై 1న ప్రపంచ పేపర్ బ్యాగ్ దినోత్సవం జరుపుకుంటున్నారు. ఇలాంటి అనేక రకాల రోజులు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. మరి ఈ ప్రపంచ కాగితపు సంచుల దినోత్సవాన్ని మనం ఎందుకు జరుపుకోవాలి? జులై 12న దీన్ని ఏటా ఎందుకు నిర్వహిస్తున్నారు? పేపర్ బ్యాగులు మనకు అవసరమా? అన్నది ఇచ ర్చించాలి. ఇవి పర్యావరణానికి మేలు చేసేవి అని తెలిసి కూడా ప్రజలు ఎందుకు వీటిని వాడలేకపోతున్నారు? పేపర్ బ్యాగుల్ని వాడకపోతే ఏమవుతుంది? ప్రపంచమునిగిపోతుందా? దేశాలు సముద్రాల్లో కలిసిపోతాయా? జల ప్రళయం వస్తుందా? అన్న ప్రశ్నలు ఉదయించవచ్చు. మనం భూకంపం తర్వాత వచ్చే వేగవంతమైన సునామీలను చూసి వుంటాం. ఆ సునామీలు ఒక రోజుతోనే ముగిసిపోతాయి. కానీ పేపర్ బ్యాగ్స్ వాడకపోవడం వల్ల వచ్చే సునామీకి రావడమే గానీ పోవడం తెలియదు.ఎందుకంటే అది నిదానంగా వచ్చే జల ప్రళయం లాంటిది. ప్రపంచాన్ని ముంచేసే మహా ప్రళయం ప్లాస్టిక్‌కు ఉంది. తెల్లారితే మనం ఎక్కువగా వాడేది ప్లాస్టిక్ క్యారీ బ్యాగులే. వాటిని మనం ఇలా వాడి అలా పారేస్తాం. కానీ అది భూమిలో కరిగిపోవడానికి వెయ్యి సంవత్సరాలు పడుతుంది. అయినా కరిగిపోతుందన్న నమ్మకం లేదా దాకలాలు లేవు. ఇలా రోజూ ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది కోట్ల ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ సంచులు, వాటర్ బాటిళ్లు వాడి పారేస్తున్నారు. ఇవి అటు తిరిగీ, ఇటు తిరిగీ చివరకు సముద్ర గర్భంలోకి వెళ్తున్నాయి. వీటిని రీసైక్లింగ్ చేసే వ్యవస్థలు సరిగా లేనందువల్ల భూమిలో పడేసు న్నారు. అందువల్ల ప్రపంచ దేశాలు రహస్యంగా చెత్తను సముద్రంలో పడేస్తున్నాయి. అలాగే డ్రైనేజీ మురికి కాలువల్లోకి వెళ్లడం.. అక్కడి నుంచి సముద్రాల్లోకే చేరుతోంది. పరిశ్రమల వ్యర్థాలు కూడా చివరకు చేరుతున్నది సముద్రాన్నే. ఇలా అన్నీ సముద్రంలో కలుస్తుంటే.. సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. అందుకే జల ప్రళయం నిశ్శబ్దంగా వస్తోంది. తీర ప్రాంత నగరాల్ని కబళిస్తోంది. దీనికి చెక్ పెట్టాలంటే ప్లాస్టిక్ వాడకం తగ్గించి... పేపర్ బ్యాగుల్ని వాడాలన్నది ప్రపంచ దేశాల సందేశం. అందుకోసం పేపర్ బ్యాగుల్ని... భూమిలో త్వరగా కలిసిపోయే పదార్థాలతో తయారు చేస్తారు. మహా అయితే 3 నెలల్లో అవి భూమిలో కలిసిపోతాయి. మొక్కలకు ఎరువుగా మారిపోతాయి. వాటివల్ల పర్యావరణానికి అంతా మేలే జరుగుతుంది. ఈ విషయంపై అందరికీ అవగాహన కల్పించేందుకు ఓ రోజును కేటాయించారు. అదే జులై 12 న పేపర్ బ్యాగుల దినోత్సవం. ఇలా అయినా మనమంతా అవగాహన పెంచుకుంటామన్న ఓ మంచి ఆశయంతో దీనిని ప్రవేశ పెట్టారు. ఎందుకంటే ప్లాస్టిక్ భూమిలో కరగదు. మన శరీరంలోకి వెళ్లిన తరవాత అనేక రోగాలకు కారణం అవుతోంది. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో ప్రాణాంతక క్యాన్సర్లు వస్తున్నాయి. దానికి ప్లాస్టిక్ వ్యర్థాలు కరిగి మన రక్తంలో కలిసి పోతున్నా యని వైద్యులు గుర్తించాలరు. ఇలాంటి వాటిని కనుగొనడం ఒక ఎత్తయితే, వాటికి వైద్యం చేయలేక చేతులెత్తేస్తున్నారు. వైద్యులు. అందుకే ప్లాస్టిక్ బ్యాగులు వద్దు..పేపర్ బ్యాగులే ముద్దు..అని పర్యావరణ వేత్తలు పిలుపునిస్తున్నారు. మనం పదే పదే చెప్పుకుంటున్నా ప్లాస్టిక్ వాడకాన్ని విడువలేక పోతున్నాం. ప్లాస్టిక్ వల్ల మనకు ముప్పు..అంతేకాదు ప్రపంచాన్ని ముంచేసే జల ప్రళయం కూడా అవుతోంది. మానవాళి చేసే తప్పులకు జలం ప్రళయంగా మారి మననే కబళిస్తున్నది.. అందుకే ప్రజల్లో చైతన్యం తీసుకుని వచ్చి, ప్లాస్టిక్‌ను నిషేధించేలా ..భూమిలో త్వరగా కరిగిపోయే పేపర్ బ్యాగ్‌ల పేరు మీద ఓ దినోత్సవాన్ని జరిపే పరిస్థితులు తీసుకుని వచ్చారు. కారణం కాలుష్యం. ఇందుకు సంబంధించి కొన్ని కఠిన వాస్తవాలు తెలుసుకోవాలి. ప్రతి సంవత్సరం జులై 12న ప్రపంచ దేశాలన్నీ పేపర్ బ్యాగ్ దినోత్స వాన్ని జరుపుతు న్నాయి. తెల్లారితే చాలు... మనం ఏ షాపుకి వెళ్లినా... కూరగాయల కోసం, టిఫిన్ల కోసం వెళ్లినా ..ప్లాస్టిక్ లేదా పాలిథిన్ కవర్లలోనే ఐటెమ్స్ ఇస్తుంటారు. వాడి పారేశాక... అవి భూమిలో కరగవు. కొన్ని వేలు, లక్షల సంవత్సరాలు కరగకుండా అలాగే ఉంటాయి. ఫలితంగా సముద్రాలు, నదులు, డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగిపోతున్నాయి.చివరకు సముద్రాల్లో చేపల కంటే ప్లాస్టిక్ కవర్లే ఎక్కువ అనే రోజులు వచ్చేలా ఉన్నాయి. ఈ పాలిథిన్ కవర్ల బదులు మనమే పేపర్ బ్యాగులు వాడితే బాగుంటుందనే ప్రచారం మొదలైంది. వీటి వల్ల పర్యావరణానికి కాలుష్యం పెద్దగా ఉండదు. పైగా... ఇవి భూమిలో త్వరగా కరిగిపోతాయి. ప్రతి సంవత్సరం ఈ రోజున స్కూళ్లు, కాలేజీలు, యూనివర్శిటీల్లో పేపర్ బ్యాగుల వాడకం పై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే పాలిథిన్ కవర్ల వల్ల కలిగే నష్టాలను వివరిస్తారు. అలాగే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రజలను పేపర్ బ్యాగులు వాడమని ప్రోత్సహిస్తున్నాయి. ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అమెరికాకి చెందిన ఫ్రాన్సిస్ వోల్లే మొదటిసారి పేపర్ బ్యాగ్ యంత్రాన్ని తయారు చేశారు. ఓ రకమైన కలపతో ఈ బ్యాగులను తయారుచేస్తారు. 1871లో మార్గరెట్ నైట్... మరో యంత్రం చేశారు. అది ఫ్లాట్ బాటమ్ పేపర్ బ్యాగ్స్ తయారుచేసింది. ఆమెను గ్రాసరీ బ్యాగ్ మాతృమూర్తిగా పిలుస్తారు. ఇలా కాలక్రమంలో రకరకాల యంత్రాలు వచ్చి...పేపర్ బ్యాగులు తయారవుతున్నాయి. పేపర్ బ్యాగులు పర్యావరణానికి హాని చెయ్యవు. వీటిని వాడటం చాలా ఈజీ. వీటిలో ప్యాకింగ్ తేలిగ్గానే ఉంటుంది. ఇవి చూసేందుకు చాలా అందంగా ఉంటాయి. ఇవి భూమిలో విష వ్యర్థాలను వదలవు. వీటిని వాడేశాక... న్యూస్ పేపర్లు, మేగజైన్లు, పుస్తకాలుగా రీసైక్లింగ్ చెయ్యవచ్చు.గతేడాది 2022 నాటికి యూజ్ అండ్ త్రో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలంటూ 2017లో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ ఆచరణలో అది అమలు కావడం లేదు. మన దగ్గర మార్కెట్‌లోకి వస్తున్న ప్లాస్టిక్‌లో 80 శాతం తిరిగి సముద్రంలోకి చేరుతుంది. ప్లాస్టిక్ నియంత్రణ, డిస్పోజల్‌కు సరైన పద్ధతులు అమలు చేయకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తుతోంది. ప్యారిస్ ఒప్పందం మేరకు కాలుష్యం తగ్గాలంటే, పర్యావరణం కాపాడు కోవాలంటే అర్జంటుగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకం మానేయాలి.

# తిరుమల ఆన్లైన్ కష్టాలు తీరేదెన్నడు

కలియుగ వైకుంఠంగా పిలువబడుతున్న తిరుమలలో కొలువై వున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని జీవితంలో ఒక్కసారైనా దర్శించుకోవాలని భక్తులు భావిస్తారు. కానీ గత నాలుగు సంవత్సరాలుగా తిరుమల తిరుపతి దేవస్థానం తీసుకున్న నిర్ణయాలు భక్తుల మనోభావాలు దెబ్బతినేలా చేశాయి. కొత్త ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరిస్తుందని భక్తులు గంపెడాసలుతో ఎదురు చూస్తున్నారు.

**పరకామణి పవిత్రత:**
పరకామణి అంటే స్వామి వారికి భక్తులు ఎంతో భక్తి పూర్వకంగా సమర్పించిన కానుకలను లెక్కించే స్థలం. స్వామి వారి హుండీలో కానుకలను లెక్కించి ఆ వివరాలను శ్రీనివాసునికి నివేదించడం అనాదిగా వస్తున్న ఆచారం. గతంలో పరకామణి స్వామివారి ఆలయం లోపలనే ఉండేది. గత ఫిబ్రవరి నుండి లెక్కింపుని ఆలయం వెలుపల పరకామణి భవనంలో లెక్కిస్తున్నారు. బయట లెక్కించడానికి తిరుమల తిరుపతి దేవస్థానం (తి.తి.దే) చెప్తున్న ప్రధాన కారణం లోపల స్థలాభావం అని. ఇది సహేతుకమైనదే కావచ్చు. కానీ ఎన్నో యేండ్ల నుండి పరకామణి స్వామివారి సన్నిధిలోనే ఉండేది. దీనిపై పండితుల సలహా తీసుకొని మొదట ఉన్న ప్రదేశంలో ఉంచాలని చాలా మంది భక్తుల మనోగతం.

**ఆన్లైన్ కష్టాలు:**
ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లను నెల మొత్తానికి సుమారు డెబ్బై రోజుల ముందు ఒకేరోజు ఒకేసారి ఆన్లైన్లో విడుదల చేస్తున్నారు. రోజుకు కనీసం ఇరవైవేలు చెప్పున తీసుకున్నా నెల రోజులకు ఆరు లక్షల టిక్కెట్లు ఒకేసారి విడుదల చేయడం వలన సర్వరుపై భారం పడి హైస్పీడ్ అంతర్జాలం గల వారికి మాత్రమే ఈ టిక్కెట్లు దొరుకుతున్నాయి. టికెట్స్ బుక్ చేసే సమయంలో యే సైటులో లేని విధంగా ఐదు నుండి ఆరు నిమిషాల కౌంట్ డౌన్ తరువాత తి.తి.దే సైట్ ప్రత్యక్షం అవుతుంది. తీరా టికెట్స్ పొందడానికి ప్రయత్నించేటప్పుడు అందుబాటులో ఉన్న టికెట్స్ ఆకుపచ్చ రంగులో కనిపిస్తున్నాయి. టికెట్స్ బుక్ చేద్దాం అంటే " మీరు బుక్ చేయడానికి ప్రయత్నిస్తున్న స్లాట్స్ వేరేవారు ప్రయత్నిస్తున్నారు" అని సందేశం చూపెడుతుంది. మళ్లీ మొదటికే రావాలి. ఇవన్నీ దాటినా కూడా ఒక్కోసారి పేమెంట్ ఫెయిల్ అవుతుంది. చివరకు టికెట్స్ దొరకడం చాలా కష్టంగా మారింది. దీనికి కారణం నెల మొత్తానికి ఒకేసారి టికెట్స్ విడుదల చేయడం. గత ఐదు సంవత్సరాల ముందర పరిస్థితులు ఇలా ఉండేవి కాదు. టికెట్లను యేరోజుకారోజు యాభై రోజుల ముందు ప్రతీ రోజు విడుదల అయ్యేవి. అందరికీ దొరికేవి. ఒక రోజు దొరకకపోతే మరుసటి రోజు ప్రయత్నం చేసేవారు. ఆన్లైన్లో దొరకని వారు జిల్లా కేంద్రంలో తితిదే కౌంటర్లో పొందేవారు.

ఇక వసతి విషయానికి వస్తే చుక్కలు చూపిస్తున్నారు. తిరుమల మరియు తిరుపతి రెండు ప్రదేశాల వసతి కూడా నెల మొత్తానికి ఒకే రోజు ఒకేసారి ఏకకాలంలో విడుదల చేస్తున్నారు. ఇక్కడ కూడా పరిస్థితి సేమ్ టు సేమ్. కనీసం తిరుమలలో వసతికి ఒకరోజు, తిరుపతిలో వసతికి మరో రోజు విడుదల చేయాలనే కనీస అవగాహన తి.తి.దే లేదా? ముందస్తు వసతి కోసం అడ్వాన్స్ ను ముందుగానే వసూలు చేస్తున్నారు. వంద రూపాయల గది కోసం ఐదు వందల అడ్వాన్సుతో మొత్తం ఆరు వందల రూపాయలు ముందుగానే చెల్లించాలి. గతంలో గది తీసుకునే ముందు ఆఫ్ లైన్లో అడ్వాన్స్ చెల్లించేవాళ్ళం. గది ఖాళీ చేసిన తరువాత ఈ అడ్వాన్సు అక్కడే తిరిగి ఇచ్చేసేవారు. ఇప్పుడు అలా కాకుండా బ్యాంకు ఖాతాకు పంపిస్తున్నారు. ఎంత మంది పేదవారు ఆన్లైన్లో అకౌంట్ నంబర్ ఉపయోగించి వసతి బుక్ చేసుకోగలుగుతారో వారికే తెలియాలి.

**ఒక్క దర్శనానికే పరిమితం:**
ఎంతో దూరం నుండి వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని వచ్చే భక్తులు ఆ శ్రీనివాసుని దివ్యమంగళ రూపాన్ని దర్శించుకుంటారు. గతంలో రెండు సార్లు దర్శన భాగ్యం చేసుకునే వీలుండేది. గత నాలుగు సంవత్సరాల నుండి ఒకసారి మాత్రమే దర్శనం ఇస్తున్నారు. గతంలోలా దీనిని పునరుద్ధరించాలి. నడకదారిలో వెళ్తున్న వారు చాలా అగచాట్లు పడుతున్నారు. ఎన్నడూ లేనివిధంగా పులిదాడి జరిగింది. అడపాదడపా క్రూర మృగాలు కనిపిస్తూనే ఉన్నాయి. దీనికి శాశ్వత పరిష్కారం ఆలోచించాలి. ఇక నడక దారిలో ఆహార పదార్థాలు ముద్రిత ధర కంటే అధిక ధరకు విక్రయిస్తున్నారు. వీటిని నియంత్రించాలి.

**వసతి గదులలో శుభ్రత:**
వసతి గదుల రేటులు పెంచారు. కానీ సౌకర్యాలు కల్పించడం లేదు. ముందరి భక్తులు వసతిగది ఖాళీ చేసిన తరువాత బ్లాంకెట్లు మార్చడం లేదు. బదులుగా వాడిన వాటినే పరుస్తున్నారు. గదులలో పరిశుభ్రత లేదు. అడిగితే ఎవరూ స్పందించడం లేదు. ఆన్లైన్ వసతి గదుల కేటాయింపునకు క్యుఆర్ కోడ్ స్కానింగ్ కొరకు సి.ఆర్.ఒ ఆఫీసుకి వెళ్ళాలి. అక్కడ నుండి దూరంలో ఉన్న కాటేజీలకు చేరాలంటే కష్టంగా ఉంటుంది. అలా కాకుండా వివిధ ప్రాంతాలలో స్కానింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. కొండమీద కార్లు, జీపులలో ప్రయాణానికి అధిక ధరలు వసూలు చేస్తున్నారు. వీటిని నియంత్రించాలి. పోనీ ఉచిత బస్సుల్లో పోదామంటే కిక్కిరిసి ఉంటున్నాయి. బస్సుల సంఖ్య పెంచాలి.

**తోపులాట:**
వెండి వాకిలి నుండి స్వామి వారిని దర్శనం చేసే వరకూ తోపులాట జరుగుతుంది. కనీసం రెండు సెకనులు కూడా స్వామివారిని కళ్ళారా చూడనివ్వడం లేదు. ఈడ్చేస్తున్నారు. తోపులాట జరగకుండా స్వామి వారిని కనులారా దర్శించుకునే ఏర్పాటు కొత్త ప్రభుత్వం చేయాలి.

**ప్రసాదం – అన్నప్రసాదం నాణ్యత:**
భక్తులు అమృత సమానంగా భావించే స్వామివారి లడ్డూ బరువుతో పాటు నాణ్యత కూడా తగ్గింది. అన్నప్రసాదంలో నాణ్యమైన భోజనం దొరకడం లేదు. ఈ విషయాలు ఆ మధ్య సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవడం అందరకూ తెలుసు.

**నీరు ధర కూడా ఎక్కువే:**
ఇక కొండ మీద ప్లాస్టిక్ నిషేధం పేరిట ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ నిషేధించారు. ఇది మంచి నిర్ణయం. కానీ పేరు ఊరూ లేని 750 మిల్లీ లీటర్ల గాజు బాటిల్ ధర 70 రూపాయలు. దీనిని ఎంత మంది కొనుక్కోగలరు? తిరుమల హొటల్లో రేట్లు చూస్తే ఒక దోస డెబ్బై రూపాయలు. టీ ఇరవై రూపాయలు. భోజనం మూడు వందల రూపాయలు. ఈ ధరలు తగ్గించే ఏర్పాటు చేయాలి.

**భక్తుల ఎదురు చూస్తున్నారు:**
ఇంతకు ముందులా ప్రతీ జిల్లా కేంద్రాలలో తి.తి.దే కౌంటర్స్ ప్రారంభించాలి. అక్కడ ప్రతీ రోజూ దర్శనం, వసతి బుక్ చేసుకునే సౌకర్యం కల్పించాలి. దర్శనం, గదుల టికెట్లను నెల మొత్తానికి ఒకేరోజు విడుదల చేయకుండా ఇంతకు ముందులా రోజు వారీగా 60 రోజుల ముందుగా దర్శనం మరియు వసతి బుక్ చేసుకునే విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలి. దర్శనం టికెట్టుతో పాటే వసతి కూడా పొందే సౌకర్యాన్ని కలిగించాలి. కోవిడ్ సమయంలో లక్కీడిప్లో కేటాయించబడిన సేవలను లాక్ డౌన్ వలన యే ఒక్క భక్తుడు ఉపయోగించ లేకపోయారు. వారికి మరలా అవకాశం ఇవ్వాలని చాలా మంది కోరుతున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. సాక్షాత్తు ముఖ్యమంత్రి స్వామివారిని దర్శించుకున్న సందర్భంలో తిరుమల నుండే ప్రక్షాళన చేస్తామని ప్రకటించారు. కొత్త కార్యనిర్వహనాధికారి తీసుకుంటున్న నిర్ణయాలను భక్తులు స్వాగతిస్తున్నారు.

డి జయరామ్
ఆంధ్రప్రదేశ్

## కవిత్వం

### పాలిట్రిక్స్

మేడిపండు చూడ
చందమే నగరాలు,
ఒక్క వర్షమొస్తే చాలు
నిండ నీట మునుగు!

ఏరులై పారుతుండు
రోడ్లపైన డ్రైనేజీ గబ్బు
నగుబాటుగా నవ్వుకుంది
నాయకుల పనికి మబ్బు !

-న్యాలకంటి నారాయణ
9346200066

### మయసభ..?

చూడ చూడ...
దూరపు కొండలు
నునుపే...
దగ్గరకెళ్ళి చూడ అంతా
రాళ్ళూరప్పలే
చెట్లుచేమలే...
పాములపుట్టలే
రాళ్ళగుట్టలే...

చూడ చూడ...
ఉప్పు చక్కెర పోలిక
ఒక్కటే...
తిని చూడ రుచులు
వేరు వేరే...

చూడ చూడ...
కాకి కోకిల రంగు
ఒక్కటే...
కానీ కూతలు విని
చూడ
వాటి స్వరాలు వేరు
వేరే...

చూడ చూడ...
కుక్క నక్క పోలిక
ఒక్కటే...
కానీ గట్టిగా
గమనించిచూడ
వాటి విశ్వాసాలు వేరు
వేరే...
సృష్టి అంతా చిత్రమే
విచిత్రమే...
అంతుచిక్కని ఒక
చిదంబర రహస్యమే...

రచన:
"కవిరత్న"
"సహస్ర కవి భూషణ్"
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్

### ఒక భావం

కన్పిస్తే జీవం
కన్పించక పోతే దైవం
కన్పించి కన్పించక పోతే
దయ్యమనే ఒక భావం

కోటం చంద్రశేఖర్
9492043348

### ఆశాజీవి

ఎక్కడా లేనప్పుడు దోషం
దొరకు ఏదో ఒక అవకాశం
ప్రయత్నం కొనసాగిస్తే
అందదా సుదూర ఆకాశం

కోటం చంద్రశేఖర్
9492043348

## వ్యాసకర్తలకు వినతి

రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు పంపేవారు మీ వ్యాసాలను వీలైనత క్లుప్తంగా, వివరణాత్మకంగా, 350-400 ల పదాలకు పరిమితం అయి ఉండేలా చూడండి. పెద్ద వ్యాసాలను పరిశీలించనడం సాధ్యం కాకపోవచ్చని గ్రహించగలరు. వర్డ్ డాక్యుమెంట్, లేదా ఓపెన్ ఫైల్ లో, ఈ మెయిల్ కు మాత్రమే పంపగలరు.
mantalukathalu@gmail.com
-ఎడిటర్




## గుర్తింపు కోరవద్దు

సీతంపేట పచ్చని పంటలు పండే ఊరు.పాడి కి కొదవే లేదు.అక్కడి ప్రజలందరూ కూడా బాగా తెలివైన వారు.ఒక రోజు పాఠశాల నుంచి వచ్చిన మధు ఎందుకో చాలా చిరాకుగా కనిపించాడు వాళ్ళ తాతయ్యకు, కాసేపటి తన పక్కన కూర్చోబెట్టుకుని ఏమైంది అని అడిగాడు తాతయ్య.

"ఈ రోజు తాను పాఠశాల నందు ప్రార్థన నిర్వహించే తప్పుడు మా లెక్కల మాస్టారు పని చేస్తే మంచి గుర్తింపు ఉంటుందని చెప్తూ మా తరగతిలోకి మూర్తిని మెచ్చుకున్నారు.అతను బడిలోని ఒక ఖాళీ స్థలంలో రెండు మొక్కలు నాటాడు, నేను రోజూ ఎంతో కష్టపడి పనిచేస్తే నన్ను మాత్రం పట్టించుకోలేదు. అందుకే నేను రేపటి నుండి ఏదో ఒక సాకు చెప్పి స్కూల్ లీడర్ గా తప్పుకుంటా అప్పుడు ఆపని వేరే వారు చేయలేక మళ్ళీ నన్నే రమ్మంటారు"అన్నాడు.



అది విన్న తాతయ్య నవ్వుతూ నీ ఇష్టం అని అక్కడి నుండి వెళ్ళిపోయాడు.కొన్ని రోజులు తరువాత మధు ను పిలిచిన తాతయ్య ఇంతకీ నువ్వు చేసిన పని వల్ల ఎం జరిగింది అని అడిగారు.

మౌనం కాస్త వీడుతూ "నేను లేకపోయినా ఆ పని జరిపోతోంది"అన్నాడు."నీకో ముఖ్యమైన విషయం చెబుతా విను ఈ ప్రపంచంలో ఎవరు లేక కాదు చేయక పోయినా ఏ పని కూడా ఆగదు. కోడి కూయక పోతే తెల్లవారదా? చెప్పు " అన్నాడు తాతయ్య.

"మరి ఈ విషయం నాకు ముందే ఎందుకు చెప్పలేదు" అన్నాడు మధు. నువ్వు అనుభవం ద్వారా తెలుసుకుంటావని, మరొక్క విషయం మనం ఏ పనిచేసినా అది గుర్తింపు కోసం చేయకూడదు అది కచ్చితంగా నీకు తృప్తిని ఇవ్వదు.నిజం చెప్పు మూర్తి నిజంగా గుర్తింపు ఆశిస్తే ఆ మొక్కలు పెరిగి,పండ్లను ఇచ్చి ఆకలి తీరుస్తయా చెప్పు"అన్నారు తాతయ్య.

"అవును తాతయ్య మీరు నాకు ఈ విషయం మీరు భగవత్ గీత చదివేటప్పుడు చెప్పారు.పని చెయ్యి ఫలితం ఆశించ వద్దని. ఇకపై నేను కూడా మంచి పనులు చేస్తా అదే కదా నా పని"అంటూ తాతయ్య ను గట్టిగా హత్తకున్నాడు.

సింగంపల్లి శేష సాయి కుమార్

# గంగమ్మ బోనాల పండుగలో పాల్గొన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

జగిత్యాల జూలై 12 (ప్రజామంటలు):
పట్టణంలోని అన్నపూర్ణ చౌరస్తా నుండి ముప్పారపు చెరువు గంగమ్మగుడి తులసి నగర్ నుండి లిగంపేట వరకు గంగపుత్ర ఆడపడుచులు బోనం నెత్తిన ఎత్తి ర్యాలీగా వెళ్లారు, గంగమ్మ తల్లి బోనాల పండుగ లో పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, కౌన్సిలర్స్ పద్మ సింగరావు, నక్క జీవన్, కాంగ్రెస్ నాయకులు రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ....

ఆషాడ మాసం వర్షాకాలం ఆరంభంలో మహిళా తల్లులు ఆడబిడ్డలందరూ కూడా వారి వారి కుల మరియు ఇష్ట దేవతలను ఆరాధించే విధంగా పోచమ్మ తల్లి బోనాలే కాని ఎల్లమ్మ తల్లి బోనాలే కాని గంగపుత్ర సోదర సోదరీమణులు గంగమ్మ తల్లి బోనాలు ఆ గంగమ్మ తల్లి ఆశీర్వచనాలు పొందే విధంగా బోనాల ఉత్సవాలను నిర్వహింప చేసుకోవడం హర్షించ వలసిన విషయం అభినందించే విషయం వారి కులవృత్తి చేపలు పెంచడం చెరువులే వారి జీవనాధారం ఒక విధంగా ప్రమాదకరమైన వృత్తి అయినప్పటికీ ఆ గంగమ్మ తల్లి దీవెనలతో వారికి ఆపదలు ఆటంకాలు జరగకుండా వారిని ఎప్పుడు కాపాడే విధంగా ఆ గంగమ్మ తల్లి ఆశీర్వచనలు వారిపై ఉంటాయి. ఈరోజు అన్నపూర్ణ చౌరస్తా తులసి నగర్ గంగపుత్రులు అందరూ ఈ సంవత్సరం గంగమ్మ తల్లి బోనాలను అత్యంత వైభవంగా నిర్వహింప చేసుకోవడం వారి అందరిని హృదయపూర్వకంగా అభినందిస్తూ రాబోయే కాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు కుంటలు అన్ని జల కనంతో ఉత్పడే విధంగా వారి ఉపాధి చేపల వృత్తి వృద్ధి చెందే విధంగా అన్ని విధాలుగా ఆ



గంగమ్మ తల్లి ఆశీర్వచనలు ఉండాలని కోరుతున్నాను.

మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ....

అన్నపూర్ణ చౌరస్తా తులసి నగర్ బోనాల పండుగ కార్యక్రమానికి మిమ్మల్ని ఆహ్వానించిన గంగపుత్ర సోదర సోదరీమణులకు అందరికీ ధన్యవాదాలు. గంగమ్మ తల్లి అందర్నీ చల్లగా చూడాలి వర్షాలు మంచిగా పడాలి. రైతులు అందరు సంతోషంగా ఉండాలి. రైతు బాగున్న రోజే భారతదేశం బాగుంటుంది. రైతు బాగుంటేనే మనం మూడు పూటలా తినగలుగుతాం. కాబట్టి రైతు సంతోషంగా ఉంటే మనం సంతోషంగా ఉన్నట్టే గంగమ్మ తల్లి వర్షాలు పడేలా చూసి అందర్నీ సంతోషంగా చూసి ఈ సంతోషమైన వాతావరణంలో ఆషాడ మాసంలో ప్రతి ఒక్కరు బోనాలు తీయడం జరుగుతుంది. అందరి ఇంటిలో ఒక పండుగ వాతావరణం ఉంటుంది. అందరు సంతోషంగా బోనాల పండుగ జరుపుకొని ప్రతి ఒక్కరు సంతోషంగా ఉండాలి. గంగమ్మ తల్లి అందరికీ సంతోషాన్ని ఇస్తూ మన ఊరు, మన పల్లె, మన రాష్ట్రం, మన దేశం సంతోషంగా ఉండాలని గంగమ్మ తల్లి కోరుతున్నాను అని ఆన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం అవసరం

## ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

### రామ కిష్టయ్య సంగన భట్ల

ధర్మపురి జూలై 12 (ప్రజామంటలు):
వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అప్రమత్తం అవసరమని రాష్ట్ర ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణానికి చెందిన 7 వార్డు కౌన్సిలర్ వేముల నాగలక్ష్మి రాజేష్ ఆధ్వర్యంలో ధర్మపురి క్షేత్రం లోని ఎస్ హెచ్ గార్డెన్ లో శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్ర సన్ షైన్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ప్రముఖ వైద్యులు తాటిపాముల సురేష్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపు ను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైద్య వృత్తి ఉత్కృష్ట మైనదని, వైద్యులు ప్రాణ దాత లన్నారు. పర్యావరణ ప్రభావం, పరిసరాల అపరిశుభ్రత, కాలుష్యం, ప్రధానంగా ప్రజల జీవన విధానం కారణాలుగా ఎన్నో ప్రాణాంతక వ్యాధులు సోకుతున్నాయని, ప్రజలకు వాటి పట్ల అవగాహన ఉండాలన్నారు. పేద ప్రజల ఆరోగ్యం వైద్యం కోసం అవసరమైన ఆరోగ్యశ్రీ వర్తింప చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ మధ్య కాలంలో క్యాన్సర్, గుండె సంబంధ రోగాలు అధికం అవుతు న్నాయని, ముందుగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉచిత మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసిన కౌన్సిలర్ వేముల నాగలక్ష్మి రాజేష్ ని అభినందిస్తున్నామని, ప్రతి ఒక్కరూ హెల్త్ క్యాంపును వినియోగించు కోవాలని, రానున్నది వర్షకాలమని ప్రతి ఒక్కరూ ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పీసీసీ సభ్యులు దినేష్ మాట్లాడుతూ, త్వరలో మెగా వైద్య శిబిరం నిర్వహించే



యోచనలో ఉన్నామన్నారు. ఆర్యవైశ్య నేత జక్కు రవీందర్ స్వాగతం పలికిన, నిర్వాహకులు, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వేముల నాగలక్ష్మి తొలి పలుకులతో ప్రారంభమైన కార్యక్రమంలో, వైద్యులు తాటి పాముల సురేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేముల రాజేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రామయ్య, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు సి హెచ్ రాజేశ్, కౌన్సిలర్ యూనస్, జక్కు పద్మ, గరిగె, సంతోషి, తదితరులు వేదికా సీను లైనారు. షుగర్, బిపి, ఈసీజీ, 2డి ఇకో పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు అందజేసిన కార్యక్రమంలో ఆహుతులతో పాటు డాక్టర్ సురేష్, డాక్టర్ అపూర్వ, డాక్టర్ శిరీష్, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఆర్ఎంపి, పిఎంపి వైద్యులు శిబిరానికి సహకరించారు. వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలి



జనగామ జూలై 12 (ప్రజామంటలు):
అధికారులు గ్రామీణ ప్రాంతాలలోని కార్యకలాపాలు సక్రమంగా నిర్వర్తించేలా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్రామ ప్రత్యేక అధికారులు, ఎంపిడివోలు, పంచాయతీ సెక్రటరీ లతో గ్రామస్థాయి కార్యకలాపాలపై కలెక్టర్ సమీక్షించారు. మహిళ శక్తి పథకం, వన మహోత్సవం, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ తీరు, మధ్యహన్న భోజన పథకం, సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత వంటి గ్రామీణ కార్యకలాపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత మహిళ శక్తి పథకం పై మాట్లాడుతూ... మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఎంపికలో శ్రద్ధ వహించాలని పాడిపరిశ్రమ లోని వారికి పాడిగేదెలు, ఆయా రంగాలలో ఆసక్తి ఉన్నవారిని యూనిట్ల స్థాపనకు ప్రోత్సహిస్తూ, అవగాహనతో ఉన్నవారిని ఎంపిక చేస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా గతంలో నాటిన మొక్కల ప్రగతిని అడిగి తెలుసుకుంటూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు పటిష్టమైన ప్రణాళిక రూపొందించు కోవాలన్నారు. నర్సరీలను పర్యవేక్షిస్తూ మొక్కలు ఎదిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి బాలల ఆరోగ్యాన్ని పరిశీలించాలన్నారు. పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని, ఎదుగుదల లేని పిల్లలను గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రైమరీ పాఠశాలల్లో వారానికి ఒకసారి భోజనం చేస్తూ పర్యవేక్షించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా లోతట్టు ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యం మెరుగుపరుస్తూ,మురుగు నీటిలో ఆయిల్ బాల్స్ వేయిస్తూ, దోమ లార్వా అరికట్టాలన్నారు. డ్రైనేజీలు శుభ్రపరిచేందుకు చర్యలు తీసుకుంటూ, దోమలని పారద్రోలేందుకు గ్రామాలలో ఫాగింగ్ చేపట్టాలన్నారు. ట్యాంక్ లను నిరంతరం శుభ్రపరుస్తూ త్రాగునీటిని క్లోరినేషన్ చేయించాలన్నారు. గతంలో డెంగ్యూ, మలేరియా జ్వరాలు వచ్చిన ప్రాంతాలపై దృష్టి పెట్టాలని, నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం ఫ్రైడే. డ్రైడే. కార్యక్రమాన్ని నిర్వహిస్తూ దోమ లార్వా అరికట్టేందుకు ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు తమ విధులను పక్కాగా నిర్వహించాలని, చేపట్టిన పనులను రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, జెడ్పి సీఈవో అనిల్ కుమార్, డిఆర్డిఏ పిడి మొగులప్ప జిల్లా అధికారులు మండల అధికారులు పంచాయతీ సెక్రటరీలు, అంగనవాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## జిల్లా విద్యాధికారి రాము




జనగామ జూలై 12 (ప్రజామంటలు):
తెలంగాణ పర్యావరణ, అడవులు, సైన్స్, టెక్నాలజీ శాఖ విభాగమైన జాతీయ హరిత దళం (ఎన్జి సి) ఆధ్వర్యంలో జనగామ పట్టణంలోని ఏకశిల బీఈడీ కళాశాలలో జిల్లాలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'జిల్లా స్థాయి పర్యావరణ పోటీలు' నిర్వహించారు. ఈ పోటీలలో జిల్లాలోని వివిధ మండలాల నుండి పోస్టర్ మేకింగ్ లో 100 మంది, కవితా రచనలో 100 మంది మొత్తం 200 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోస్టర్ మేకింగ్ లో బి. కీర్తి (సెయింట్ మేరీ హైస్కూల్, జనగాం) ప్రథమ, గణేష్ (లింగాల ఘనపూర్ మోడల్ స్కూల్) ద్వితీయ, బి శ్రావణి ( పెంబర్తి ఉన్నత పాఠశాల) తృతీయ స్థానంలో నిలిచారు. అలాగే కవితా రచనల పోటీలలో ఆర్. అభినేత్రి (కేజీబీవీ బచ్చన్నపేట) ప్రథమ, టీ. తేజస్విని (సెయింట్ మేరీ హై స్కూల్, జనగాం) ద్వితీయ, కే. సిరి (ఏకశిలా హై స్కూల్, జనగాం) తృతీయ, సుష్మా (కేజీబీవి జాఫర్గడ్) ప్రత్యేక బహుమతులను పొందారు. బహుమతి ప్రధానోత్సవ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి కే.రాము మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుండి పర్యావరణం పై అవగాహన కలిగి ఉండాలని, ఉపాధ్యాయులు ఇందుకోసం పాఠశాలలో సరియైన అవగాహన కల్పించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని గుర్తు చేశారు. విజేతలకు మేమెంటో,సర్టిఫికెట్లు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్జిసి జిల్లా కోఆర్డినేటర్ గౌసియా బేగం, అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు. కార్యక్రమ ఇన్చార్జిగా సీనియర్ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ వ్యవహరించారు.

# రాష్ట్ర సమాచార కమిషనర్ (ఎస్.ఐ.సి.) గా సిసిఆర్ ఆర్టీఐ ఎన్.జి.ఒ. ఫౌండర్ ఛైర్మన్ మంచికట్ల అనిల్ కుమార్ నామినేషన్



జగిత్యాల జూలై 12 (ప్రజామంటలు):
రాష్ట్ర సమాచార కమిషనర్ (ఎస్.ఐ.సి.) గా సిసిఆర్ ఆర్టీఐ ఎన్.జి.ఒ. ఫౌండర్ ఛైర్మన్ మంచికట్ల అనిల్ కుమార్ నామినేషన్. సిసిఆర్ ద్వారా తాము చేసిన 6000 కు పైగా సామాజిక %ు% ఆర్టీఐ కార్యకలాపాల స్వచ్ఛంధ సేవలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని స్థానిక ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి ని కలిసిన సిసిఆర్ బృందం: అనిల్ కుమార్ ను అభినందించిన ఎమ్మెల్సీ 25,000 కు పైగా ఆక్టివ్ సభ్యులు %ు% వాలంటీయర్స్ వున్న సిసిఆర్ సంస్థ భారత్ లోనే కాకుండా ప్రపంచంలోనే ఆర్టీఐ పై స్వచ్ఛందంగా పని చేసే ఏకైక అతి పెద్ద సంస్థ అని ఈ సందర్భంగా అనిల్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సమాచార కమిషనర్ గా కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ (సిసిఆర్) సంస్థ ఫౌండర్ ఛైర్మన్ మంచికట్ల అనిల్ కుమార్ ను నియమించాలని సిసిఆర్ సెంట్రల్, తెలంగాణ స్టేట్ %ు% జగిత్యాల జిల్లా కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. సిసిఆర్ సభ్యులు మాట్లాడుతూ.... ప్రజల హక్కుల కొరకు పాటుపడే అత్యంత కీలకమైన సమాచార కమిషనర్ పోస్ట్ ఎన్నో నెలల నుండి ఖాళీగా ఉందని, దానివల్ల ఎన్నో ఫైల్లు, అప్పీల్లు, ఫిర్యాదులు పెండింగ్ లో ఉన్నాయని, సమస్యలు పరిష్కారం కాక సమాచారం హక్కు చట్టం నీరుగారే ప్రమాదం ఉందన్నారు. సామాజిక స్పృహతో కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ (సిసిఆర్) సంస్థ స్థాపించి సమాచార హక్కు చట్టం ద్వారా ఎన్నో సమస్యల్ని పరిష్కారం చూపుతూ, ఇప్పటి వరకు 6 వేలకు పైగా సామాజిక కార్యక్రమాలు చేపడుతూ, పారదర్శక పాలనే ధ్యేయంగా ముందుకు వెళుతున్న విద్యావేత్త, సామాజిక వేత్త, ఉచిత సివిల్స్ %ు% సాఫ్ట్ వేర్ కోచింగ్ లు నిర్వహిస్తున్న మంచికట్ల అనిల్ కుమార్ ని సమాచార కమిషనర్ గా నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందుల స్వామి, భూక్య చరణ్ కాంత్, అంకం భూమయ్య, జవ్వాజి నరేష్, నేవూరి రత్నాకర్, గుండ్ల శివచంద్రం, బి. సత్యనారాయణ, రాగుల రవి, ఎం సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ గానకోకిల పురస్కారం అందుకున్న 'రామంచ భరత్'

జమ్మికుంట జూలై 12 (ప్రజామంటలు):
"ఉద్యమ గానకోకిల" పురస్కారాన్ని అందించి ఘనంగా సన్మానించిన ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ వ్యవస్థాపక అధ్యక్షులు మేకల చంద్రశేఖర్ యాదవ్ గారికి సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర సంపత్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

ఈరోజు కరీంనగర్ ప్రెస్ భవన్ లో ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ ఉద్యమ సంస్థ ఆవిర్భావం సందర్భంగా ఉద్యమాలకు, పోరాటాలకు ఆయువు పట్టయిన ఉత్తర తెలంగాణ ప్రాంతంలో సహజ వనరులు, నిధులు, ఇసుక, క్వారీ, బొగ్గు, నీళ్లు సమృద్ధిగా ఉన్నాయని అన్నారు. ఈ ప్రాంత ప్రజలను నిర్లక్ష్యం చేస్తూ, సంపదను ఇతర ప్రాంతాలకు తరలించడం అన్యాయమని అన్నారు. ఉత్తర తెలంగాణ ప్రాంత వనరుల పరిరక్షణ కొరకే తమ సంస్థను ఈరోజు ఆవిర్భవించామని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ గాయకులకు రచయితలకు ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా ఉద్యమ గాన కోకిల పురస్కారాన్ని అందించి ఘనంగా సన్మానించి నందుకు ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ వ్యవస్థాపక అధ్యక్షులు మేకల చంద్రశేఖర్ యాదవ్ గారికి సంస్థ ప్రధాన కార్యదర్శి ముక్కెర సంపత్ గారికి హృదయపూర్వక ఉద్యమ వందనాలు తెలియజేస్తున్నాను.




సీఎం గారూ..

# ముదిరాజ్ లకు రిజర్వేషన్లు కల్పించండి

## బీసీ 'డీ' నుంచి బీసీ 'ఏ' లోకి ముదిరాజ్ లను మార్చండి

సికింద్రాబాద్ జూలై 12 (ప్రజామంటలు):



రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగి, ఆర్థికంగా బాగా చితికిన వారు కలిగిన ముదిరాజ్ కమ్యూనిటీ ని బీసీ 'డీ' నుంచి బీసీ 'ఏ' లోకి మార్చే అంశాన్ని పరిశీలించి, జీవోను విడుదల చేయాలని అఖిల భారత ముదిరాజ్ సంఘ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పొట్లకాయల వెంకటేశ్వర్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంపిన లేఖలో కోరారు. గత దశాబ్దాల తరబడిగా తీరని కలగా మిగిలిన ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్ కమ్యూనిటీ లో రూరల్ ఏరియాల్లో బాగా ఆర్థికంగా వెనకబడిన వారికి ఈ రిజర్వేషన్లు వారి పిల్లలకు విద్యా, ఉద్యోగా అవకాశాల్లో ఉపయోగపడుతుందన్నారు. గత 2010 లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి దివంగత డా.వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి ముదిరాజ్ ల కష్టాలను అర్థం చేసుకొని, వారికి న్యాయం చేయాలనే ఆలోచనతో ముదిరాజ్ కమ్యూనిటీని బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చుతూ, జీవో నెం. 15ను విడుదల చేశారన్నారు. కొందరు అన్యాయంగా ఈ జీవోపై కోర్టుకు వెళ్ళడంతో అమలుకు నోచుకోలేక నిలిచిపోయిందన్నారు. ఇప్పుడు మళ్ళీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినందున , చొరవ తీసుకొని, అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాన్ని అమలు చేయాలని కోరారు. కోట్లాది మంది ముదిరాజ్ ల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని పొట్లకాయల వెంకటేశ్వర్లు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.



జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డా. భోగ శ్రావణి కి ఆషాడ మాస పోచమ్మ తల్లి బోనాల పండుగకు ఆహ్వానం అందజేసిన మేరు సంఘ సభ్యులు

## టేకుర్తి మోడల్ స్కూల్లో ఎకనామిక్స్ అతిథి అధ్యాపక పోస్టుకు ఆహ్వానం



జమ్మికుంట జూలై 12 (ప్రజామంటలు): ఎకనామిక్స్ అతిథ్యాపకునికై దరఖాస్తులు ఆహ్వానం ఇల్లందకుంట మండలం టేకుర్తి ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఎకనామిక్స్ పి జి టి పోస్ట్ కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపల్ కే. శ్రీధర్ బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు ఈ పోస్టుకు పీజీలో ఎకనామిక్స్ కలిగి బీఈడీ అర్హత ఉన్న అభ్యర్థులు అర్హులు అని ఆయన తెలిపారు ఇందుకోసం అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో సోమవారం పాఠశాలలో నిర్వహించే డెమో కోసం హాజరు కాగలరని ఆయన తెలిపారు అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

## చెట్లను ప్రతి ఒక్కరు నాటాలి

### హరితహారం కొనసాగించడం సంతోషం

### హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



జమ్మికుంట జూలై 12 (ప్రజామంటలు): హుజురాబాద్ నియోజకవర్గం లోని వీణవంక, కమలాపూర్ జమ్మికుంట, ఇల్లందకుంట, హుజురాబాద్ మండలాల్లో పలు గ్రామాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మక చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమం చేపట్టగా హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అధికారులు ప్రజాప్రతినిధులు తో కలిసి మొక్కలను నాటారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.... హరితహార కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించడం చాలా సంతోషకరమైనదని అన్నారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ ముందు చూపుతో హరితహారం కార్యక్రమం చేపట్టడం ద్వారా ఎంతో మేలు జరిగిందని గత ప్రభుత్వం హరితహారం కోసం చాలా నిధులు కేటాయించడం జరిగింది. చెట్లను పెంచడం ద్వారా పల్లెల్లో పచ్చదనంతో ఎంతో ఉల్లాసంగా ఉంటుందని, చెట్లు నాటడంతో మనిషి జీవనానికి ఎంతో ఉపయోగపడతాయి. చెట్ల ద్వారా వచ్చే గాలి స్వచ్ఛమైనది ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని అన్నారు. ప్రతి ఒక్కరు చెట్లు నాటాలన్నారు. చల్లూరు గ్రామంలో హరితవనాన్ని ద్వారా 21 వేల మొక్కలను మామిడి, జామ తో పాటు అనేక చెట్లను నాటడం జరిగిందని హరితహారం కార్యక్రమంలో గతంలో భాగంగా మోడల్ పార్క్ లాంటి పకృతివనాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అవార్డు తీసుకున్న చల్లూరు ఇందులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరిని అభినందించారు. వన మహోత్సవంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## బచ్చన్నపేటలో బలి బలి బలి బొబ్బలి బోనాల పాట చిత్రీకరణ

జనగామ జూలై 12 (ప్రజామంటలు): జె ఎస్ కే ట్యూన్స్ యూట్యూబ్ చానెల్ జనగామ ఆధ్వర్యంలో శుక్రవారం బలి బలి బలి బొబ్బలి బోనాల పాట బచ్చన్నపేట ఎల్లమ్మ గుడి పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ చేశారు. ఆషాఢ మాసం బోనాల పండుగ పురస్కరించుకొని సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలని లక్ష్యంతో జెఎస్కే ట్యూన్స్ ఈ పాటను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని చిత్రీకరణ కొనసాగించింది. ఈ పాటను జెఎస్కే ట్యూన్స్ ఆదినేత కవి, సంగీత దర్శకులు చిలుమోజు సాయికిరణ్ రచించి స్వరపరిచి ప్రఖ్యాత గాయనీ అనుషాతో పాడించారు. ఈ పాటకు దర్శకత్వం పన్నీరు విజయం, కొరియోగ్రాపర్ బిఎస్కే చిన్న, డిఒపి ప్రవీణ్ బుజ్జి,నటీ నటులు బబ్లూ జాన్, భూమిక,కిరణ్ కుమార్, సుజాత, రవళి, ఝాన్సీ, సాత్విక, వర్ష, ఆలయ పూజారి చంద్రశేఖర్. ఈ పాటలో బోనాలు, శివసత్తులు, ఒగ్గుడోల్ల విన్యాసం, జముకుల కథ, పోతురాజు వేషాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ సందర్భంగా కవులు కళాకారుల ఐక్యవేదిక జి.కృష్ణ, జనగామ రచయితల సంఘం అయిలా సోమనర్సింహచారి, శ్రీశ్రీ కళావేదిక లగిశెట్టి ప్రభాకర్ పాల్గొని వీడియో చిత్రీకరణ ప్రారంభించారు. అతిత్వరలోనే ఈపాట యూట్యూబ్ విడుదల చేస్తామని పాట నిర్వహకులు చిలుమోజు సాయికిరణ్ తెలిపారు.





జీ తెలుగు న్యూస్ రిపోర్టర్ శ్రీ చరణ్ పై పోలీసుల దాడి ని ఖండించిన మల్లాపూర్ మండల జర్నలిస్ట్ లు

మల్లాపూర్ జూలై 12 (ప్రజా మంటలు): మల్లాపూర్ మండల కేంద్రంలోని జర్నలిస్టులు అందరూ హైదరాబాద్ లో నిరుద్యోగుల సమస్య ని కవరేజ్ చేస్తున్న జీ తెలుగు న్యూస్ రిపోర్టర్ శ్రీ చరణ్ పై పోలీసుల దాడిని ఖండిస్తూ జగిత్యాల జిల్లా మల్లాపూర్ జర్నలిస్ట్ లందరు ఏకమై స్థానిక ఎమ్మార్వో వీర్ సింగ్ కి వినతి పత్రం ఇచ్చి ప్రభుత్వం తరపున తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ లు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధిగా పని చేసే జర్నలిస్ట్ లపై ఇలా దాడులు చేయడం సరికాదని జర్నలిస్ట్ పోలీసు అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల జర్నలిస్ట్ లందరు పాల్గొన్నారు.

## ఆషాఢ మాసం వేడుకలు నిర్వహించిన కౌన్సిలర్లు



జనగామ జూలై 12 (ప్రజామంటలు): పురాణాల్లోనూ గోరింటాకు ప్రత్యేక స్థానం ఉంది. మన సంస్కృతిలో పడుచమ్మాయిల చేతులు, గోరింటాకు ఎర్రగా పండితే, మంచి భర్త వస్తాడని చెబుతుంటారు. ఏళ్ల నుండి వస్తున్న సాంప్రదాయాలను ఇప్పటికీ పాటిస్తూనే ఉన్నామని ఇక్కడ మహిళలు చెప్తున్నారు. ఫాస్ట్ కల్చర్ లో పడిపోకుండా ఓల్డ్ ఇస్ గోల్డ్ అంటూ ఈ ఆనవాయితీని కంటిన్యూ చేస్తున్నారు. జనగామలో గోరింటాకు వేడుకలు ఆకట్టుకుంటున్నాయి.ఈ అశాడ సంప్రదాయాల్లో జనగామ కౌన్సిలర్లు ఎంతో ఆనందంగా జరుపు కున్నారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఆషాడ మాసం వచ్చిందంటే చాలు ఏ ఇంట్లో చూసినా గోరింటాకు సందడే కనిపిస్తుంది అని అమ్మాయిల చేతులు గోరింటాకుతో మెరిసిపోతుంటాయి. సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల్లో ఏదో ఒక నిగూడా అర్థం ఉంటుంది అని తెలిపారు. అందుకే ఈ కాలంలో గోరింటాకు తప్పక పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో జనగామ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## నర్సింగాపూర్‌లో ఈత మొక్కలు నాటిన

### ప్రొహిబిషన్ &ఎక్సైజ్ శాఖ మరియు గౌడ సంఘం




జగిత్యాల జూలై 12 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 75 వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో ప్రొహిబిషన్ %డ%ఎక్సైజ్ శాఖ, గౌడ సంఘం ఆధ్వర్యంలో ఈత చెట్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎక్సైజ్ సీఐ సర్వేశ్వరరావు, నర్సింగాపూర్ గౌడ సంఘం అధ్యక్షులు పులి మల్లేశం గౌడ్, ధరూర్ గౌడ సంఘం అధ్యక్షులు సుద్దాల రాజు గౌడ్, సభ్యులు పులి నాంపల్లి గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఎల్లయ్య గౌడ్, బండి సునీల్ గౌడ్, సాయి గౌడ్, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనగామ జిల్లాకు ప్రభుత్వం సర్దార్ సర్వాయి పాపన్న పేరును నామకరణ చేయాలి



జనగామ జూలై 12 (ప్రజామంటలు): జనగామ జిల్లాకు ప్రభుత్వం సర్దార్ సర్వాయి పాపన్న పేరు నామకరణ చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిది గోపి అన్నారు.తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు కుర్ర ఉప్పలయ్య అధ్యక్షతన జనగామ జిల్లా కేంద్రంలో కామాక్షి ఫంక్షన్ హాల్ లో జరిగిన సమావేశానికి ముఖ్యాతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 50 సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మికునికి 4,000 రూపాయల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 18 లోపు జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు నామకరణ చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నేవెంకట మల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు కనుకటి రాజయ్య, జొన్నగొని శ్రీనివాస్ ,వడ్ల కొండ వెంకటేష్, యాదండ్ల పరంధామా, నాయిని యాదగిరి, బసవ గాని మహేందర్, బండపల్లి శంకరయ్య, బాల్నే రాజయ్య, బైరగోని వెంకటయ్య, కుర్రేముల పరుశరాములు, బూసి గంపల సమ్మయ్య, గొల్లపల్లి మురళి, మార్క ఉపేందర్, పోతుగంటి కృష్ణమూర్తి, అంబాల శ్రీనివాస్, సుద గాని సిద్ధులు పాల్గొన్నారు.



## గ్రోమోర్ సెంటర్ ను ఆకస్మిక తనఖీ చేసిన కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల జూలై 12 (ప్రజామంటలు): మన గ్రోమోర్ సెంటర్లో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ జిల్లా వ్యవసాయ అధికారి వాణితొ కలసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫర్టిలైజర్ ఈపాస్ ద్వారానే అమ్మకాలు జరపాలని సూచించారు. గ్రౌండ్ బ్యాలెన్స్ మరియు స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. పెస్టిసైడ్ లైసెన్స్ మరియు బిల్ బుక్స్ పరిశీలించి ఎక్స్పైరీ డేట్ లోపల ఉన్న పురుగు మందులు మాత్రమే విక్రయించాలని మరియు నాణ్యత గల విత్తనాలు రసీదు ఇచ్చి రైతులకు అమ్మకాలు జరపాలని తెలిపారు. కలెక్టర్ వెంట మండల వ్యవసాయ అధికారి షాహిద్ అలీ మరియు ఏయు భూమేశ్వర్ ఉన్నారు.

## గండ్రపల్లి గ్రామ పంచాయితీని పరిశీలించిన పంచాయితి రాజ్ డిప్యూటీ కమీషనర్ జాన్ వెస్లి



జమ్మికుంట జూలై 12 (ప్రజామంటలు): పంచాయితీ రాజ్ అభివృద్ధి సూచికలో భాగంగా గండ్రపల్లి గ్రామ పంచాయితీలో చేసిన అభివృద్ధి పనులు, కల్పించిన సౌకర్యాలను మరియు పంచాయితి రికార్డులను పంచాయితి రాజ్ డిప్యూటీ కమీషనర్ శ్రీ జాన్ వేస్లి గారు పరిశీలించి సంతృప్తి చెంది తగు సూచనలు ఇచ్చినారు. ఈ కార్యక్రమములో హుజురాబాద్, కరీంనగర్ డీఎల్పివోలు శ్రీనివాస్, రాంబాబు, ఎంపిడిఓ కే. భీమేష్, ఎంపీఓ సతీష్ కుమార్. ఏపీ ఓ లక్ష్మణ్ పంచాయితి కార్యదర్శి ఝాన్సీరాణి పాల్గొన్నారు.

## మేదిని లలితా కళాక్షేత్రం వారి ఆధ్వర్యంలో బోనాల పండుగ



జగిత్యాల జూలై 12 (ప్రజామంటలు): మేదిని లలితా కళాక్షేత్రం వారి ఆధ్వర్యంలో తెలంగాణ జగిత్యాల వారి తెలంగాణ బోనాల పండుగ కార్యక్రమం నేడు బూసి లక్ష్మీనారాయణ గార్డెన్ లో నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి జగిత్యాల మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుండి 500 మంది కళాకారులు వచ్చి తమ ప్రతిభను ప్రదర్శించారు. ఇట్టి కార్యక్రమంలో నాట్య విజ్ఞాన్ నాట్యరత్న మేదిని భుజంగరావు, నాట్య సామ్రాట్ బొమ్మిడి నరేష్ కుమార్, ఉపాధ్యక్షుడు పిప్పరి నర్సయ్య, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, బిసి యువజన సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపురం రాంచందర్, నియోజకవర్గ అధ్యక్షురాలు బండపెల్లి మల్లీశ్వరి, నీలం దశరథరెడ్డి స్వామి, యాంకర్ ప్రభూష తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్ ఫోర్సు ఉద్యోగాలకు అవివాహితుల నుండి దరఖాస్తుల ఆహ్వానం



జనగామ జూలై 12 (ప్రజామంటలు): ఇంటర్మీడియట్ చదివిన అవివాహితులు యువతీ యువకులు ఎయిర్ ఫోర్స్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆధ్వర్యంలో జారీ చేసిన భారతీయ వాయుసేన అగ్నిపత్ స్కీం క్రింద ఉద్యోగాలకు ఇంటర్ లేదా సమాన స్థాయి విద్యార్హతలు ఉండి 50% మార్కుల తో 3-7-2004 నుండి మూడు3-01-2008 మధ్య కాలంలో జన్మించిన వారు అర్హులని తెలియజేశారు. అవివాహితులైనవారు మాత్రమే క్లరికల్, టెక్నికల్ ఉద్యోగాలకు దరఖాస్తు చేయాలని ఆన్లైన్ పోర్టల్ http://agnipathvayu.cdac.in లో లాగిన్ అయ్యి ఈనెల 8వ తేదీ నుండి 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మేదిని లలితా కళాక్షేత్రం జగిత్యాల వారి తెలంగాణ బోనాల పండుగలో పాల్గొన్న శాతవాహన యు.పి.ఎస్. వాణీనగర్ స్కూల్ 4వ తరగతి విద్యార్థిని "గోవిందుల చైత్ర"






## శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

జగిత్యాల జూలై 12 (ప్రజామంటలు): పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న బందెల తక్ష విహార్ విద్యార్థి అమెరికా ఎన్ ఎస్ ఎస్ నాసా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేకమైన ప్రతిభ కనబరిచారు. కాస్మోస్ పారిడార్ అనే ప్రాజెక్టులో అమెరికాలో జరిగిన సమావేశానికి హాజరై జాతీయ స్థాయిలో రెండవ స్థానం సాధించారు ఈ సందర్భంగా తక్ష విహార్ అభినందన సభ లో పాల్గొని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గారు అభినందించి సత్కరించారు. మరియు పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయుల బృందాన్ని కూడా అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.... ఇంత చిన్న వయసులో మంచి ప్రతిభ కనబరిచి జగిత్యాల పేరును జాతీయస్థాయిలో నిలిపిన విద్యార్థికి అభినందనలు అని ఇంకా మరిన్ని విజయాలు భవిష్యత్తులో సాధించాలని ఆకాంక్షించారు ఎమ్మెల్యే. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సచిన్, సరిత విలియమ్స్, డీన్ శ్రీనివాస్, ఏవో సందీప్, పేరెంట్స్ డా. విజయ్, డా. గీతిక తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనం అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి

### ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

జగిత్యాల జులై 12 (ప్రజామంటలు): పట్టణములోని వివేకానంద మినీ స్టేడియం లో మున్సిపల్ మరియు వాకర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమం లో పాల్గొని మొక్కలు నాటిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ ఆడువాల జ్యోతి .ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్,కమిషనర్ సమ్మయ్య, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గౌతమ్ రెడ్డి, కౌన్సిలర్ లు, నాయకులు, మహిళలు, తదితరులు, పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ....ప్రపంచంలోనే భారత దేశం మంచి సమతౌల్య వాతావరణం కలిగిన దేశమన్నారు.33 శాతంగా ఉన్న అటవీ సంపద నేడు అంతరించిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చొరవతో నేడు రాష్ట్రంలో పచ్చదనం అభివృద్ధికి వన మహోత్సవం కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. గతంలో హరిత హారంలో భాగంగా అనేక మొక్కలు నాటడం జరిగిందని గుర్తు చేశారు. గతంలో హరితహారంలో జగిత్యాల పట్టణానికి రాష్ట్ర స్థాయి అవార్డు వచ్చిందన్నారు.ప్రజల భాగస్వామ్యంతోనే పచ్చదనం అభివృద్ధి ప్రతి ఒక్క మహిళ, యువకులు తమ ఇంట్లో, ఇంటి ఆవరణలో ఒక మొక్కను నాటాలి, సంరక్షించాలి. జగిత్యాల పట్టణంలో అనేక నర్సరీలు ఏర్పాటు చేసి లక్షల్లో మొక్కలు పెంచడం జరిగింది. జగిత్యాల నియోజకవర్గం లో రోడ్లకు ఇరువైపులా మరియు అడవి ప్రాంతంలో అనేక మొక్కలు నాటడం జరిగింది. చెట్ల ను మనం రక్షిస్తే చెట్లు మనల్ని రక్షిస్తాయి .మొక్కలు నాటడం అనేది ఒక సామాజిక బాధ్యత అని అన్నారు ఎమ్మెల్యే.





# గాంధీ భవన్‌కు.. తెలంగాణ భవన్‌కు తేడా లేదు

## ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

## భాజాపా కార్యవర్గ సమావేశంలో కిషన్ రెడ్డి



హైదరాబాద్ (ప్రజా మంటలు): అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కష్టపడి పని చేసి మంచి ఫలితాలు సాధించిన కార్యకర్తలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ అమరుల ఆకాంక్షలను నెరవేర్చేది భాజపా ఒక్కటేనని చెప్పారు. గాంధీ భవన్‌కు.. తెలంగాణ భవన్‌కు తేడా లేదని కాంగ్రెస్, భారాసలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదన్నారు. శంషాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర భాజపా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హాజరుకాగా.. రాష్ట్రానికి చెందిన మరో కేంద్రమంత్రి బండి సంజయ్, భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. భాజపాకు ఓట్లు, సీట్లు ఇచ్చిన తెలంగాణ ప్రజలకు సెల్యూట్. ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్‌గిరి గడ్డపై కాషాయ జెండా ఎగిరింది. ఆయన సొంత జిల్లాలోనూ భాజపాదే ఆధిపత్యం. పార్టీ ఓటు బ్యాంకు 14 నుంచి 35 శాతానికి పెరగడం సాధారణ విషయం కాదు. పదేళ్లు పాలించిన భారాస ఒక్క ఎంపీ సీటు గెలవలేక ప్రజాగ్రహానికి గురైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అతి తక్కువ కాలంలోనే ప్రజా విశ్వాసం కోల్పోయింది. ఆ పార్టీ వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చింది. వంద రోజులు దేవుడెరుగు.. ఎనిమిది నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయలేదు. ఫిరాయింపుల విషయంలో కేసీఆర్ తరహాలోనే కాంగ్రెస్ వెళ్తోందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారని, ఇప్పటివరకు ఎందుకు చేయలేదని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ నిరంకుశ పాలనపై విద్యార్థులు, మహిళలు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతోందని, రాజకీయ ఫిరాయింపులే అజెండాగా కాంగ్రెస్ పాలిస్తోందని దుయ్యబట్టారు. తెలంగాణను దోపిడీ చేసి ఢిల్లీ పెద్దలకు సూట్‌కేసులు పంపుతున్నారని ఆరోపణలు చేశారు. బిఆర్ఎస్ ఓట్లు బిజెపికి పడ్డాయని కాంగ్రెస్ ఆరోపణలు చేస్తుందని, బిఆర్ఎస్-బిజెపి ఎప్పటికి ఒక్కటి కాదు అని, కాంగ్రెస్-బిఆర్ఎస్ ఒక్కటి అని తెలియజేశారు. బీజేపీ రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశాలు శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలే లక్ష్యంగా కార్యవర్గ సమావేశాలు జరుగుతున్నాయి. పార్టీలో చేరికలపై బీజేపీ కార్యవర్గం ప్రధానంగా చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తేనే బీజేపీలో చేర్చుకుంటామని బండి సంజయ్ ఇప్పటికే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. సమావేశాలకు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్, సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, పార్లమెంట్ ఎన్నికల ఇంచార్జ్ అభయ్ పాటిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శంషాబాద్ మల్లికా కన్వెన్షన్‌లో కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతోన్న సమావేశాల్లో లక్ష్మణ్, బండి సంజయ్, డీకే అరుణ, ఈటల, గరికపాటి తదితరులు పాల్గొన్నారు. అలాగే పదాధికారులు, కార్యవర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు ఎమ్మెల్యేలు, జిల్లాల అధ్యక్షులు, కార్పోరేటర్లు హాజరయ్యారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత జరుగుతున్న మొదటి కార్యవర్గ సమావేశం ఇది. భవిష్యత్తు ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేసేలా ఒత్తిడి తీసికొచ్చే కార్యక్రమాలపై ఈ సమావేశాల్లో నేతలు దిశానిర్దేశం చేయనున్నారు.




# త్వరలోనే కాంగ్రెస్‌లో బిఆర్ఎస్ఎల్‌పి విలీనం

## ఆ పార్టీలో ఇక మిగిలేది నలుగురు మాత్రమే

## కార్పోరేట్ కంపెనీలా మారిన బిఆర్ఎస్

## కెసిఆర్‌ను కలిసేందుకు కూడా కష్టాలు పడాల్సిందే

## అహంకారం..నిరంకుశం ఉన్నచోట ఎవరూ ఉండరు

## ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ (ప్రజా మంటలు): త్వరలో బీఆర్ఎస్ఎల్పీ.. కాంగ్రెస్‌లో విలీనం కాబోతోందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అహంకారపూరిత, నిరంకుశ విధానాలతో నడిచే బిఆర్ఎస్ పార్టీకి మనుగడ లేదని, అందులో ఉన్న వారెవరూ అక్కడే ఉండాలనుకోవడం లేదని అన్నారు. అందుకే స్వేచ్ఛ కోసం కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. శుక్రవారం నాడు ఆదర్శ్‌నగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో హిమాయత్ నగర్ డివిజన్‌కు సంబంధించిన కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీలో మిగిలేది నలుగురు ఎమ్మెల్యేలు మాత్రమే అని చెప్పుకొచ్చారు. బి÷ఖఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కేటీఆర్ కార్పొరేట్ కంపెనీ లాగా నడిపారని విమర్శించారు. కేసీఆర్‌ను కలవాలంటే ఎమ్మెల్యేలకు అపాయిట్మెంట్ కూడా దొరికేది కాదన్నారు. ఒకవేల దొరికినా, గంటల తరబడి వెయిట్ చేయించే వారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ ఉంటుందని.. అందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నాం న్నారు. బీఆర్ఎస్‌పై నమ్మకం లేకనే ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యేలను పురుగుల్లా చూసేవారన్నారు. విలువ లేని చోట ఉండలేక కాంగ్రెస్‌లో చేరుతున్నారని వెల్లడించారు. కాంగ్రెస్‌లో అందరికి విలువ ఉంటుందన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఎమ్మెల్యేలకు స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ ఉండేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో నియోజకవర్గం అభివృద్ధి చేద్దాం అంటే అసలు ఫండే లేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కొంత మంది మంత్రులు, ఎమ్మెల్యేలు వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. దోచుకున్న వారి వివరాలు త్వరలో బయట పెడతానన్నారు. 10 ఏళ్లలో కేటీఆర్ బినామీలు వేల కోట్లు దండుకు న్నారని... త్వరలో సాక్షాలతో బయటపెడుతానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలను కాపాడుకోడానికి ఆరు నెలల్లో అధికారంలోకి వస్తామని మేకపోతు గంభీరం చూపిస్తున్నాం న్నారు. సొంత కుటుంబ సభ్యురాలు కవిత జైల్లో ఉంటే ఆమెను బయటకు తీసుకురాకుండా రాజకీయం చేస్తున్నారని ఎమ్మెల్యే దానం నాగేందర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

## ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధింపులు

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



వరంగల్,జూలై12 (ప్రజా మంటలు): రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలనలో హత్యలు, నేరాలు పెరిగిపోయాయని విమర్శించారు. హామీలపై నిలదీస్తే అధికార పార్టీ నేతలు పోలీసులతో వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన నర్సంపేటలో మీడియాతో మాట్లాడారు. గిరిజన కుటుంబంపై దాడి ఘటనతో పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతున్నదని చెప్పారు. ప్రశ్నిస్తే థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా ఆ పార్టీ స్థానిక ఎమ్మెల్యేలు ఉమ్మడి వరంగల్ జిల్లాకు పైసా నిధులు తేలేదని విమర్శించారు. కాంగ్రెస్ నేతల అడుగులకు మడుగులొత్తే అధికారులకు పోస్టింగులు ఇస్తున్నారని ఆరోపించారు. విచ్చలవిడిగా పోలీస్ అధికారుల బదిలీలు జరుగుతున్నాయని చెప్పారు. కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉందని తెలిపారు. కాంగ్రెస్ నేతలకు కమీషన్లు, పంపకాల మీద ఉన్న దృష్టి పాలనపై లేదని విమర్శించారు. గ్రామాల్లో ఆ పార్టీ నేతల వేధింపులు పెరిగాయన్నారు. ఏ పోలీస్ స్టేషన్ చూసినా రోజూ వందలమంది కనిపిస్తున్నారని చెప్పారు. పోలీసు పోస్టులను కాంగ్రెస్ నేతలు బేరాలకు పెట్టారని ఆరోపించారు. ఏ కార్యకర్తకు కష్టమొచ్చినా ఉమ్మడి జిల్లా నేతలంతా వస్తారని చెప్పారు. ఎక్కడ అన్యాయం జరిగినా నిలదీస్తామన్నారు.

# పేకాట స్థావరంపై మెట్ పల్లి పోలీసుల దాడి

## 8 గురు అరెస్ట్, 14,200 నగదు, 5 మొబైల్స్ స్వాధీనం



మెట్ పల్లి జులై 12 (ప్రజామంటలు): మెట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంపేట గ్రామ శివారులో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 8 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 14,200 నగదు,5 మొబైల్స్ ను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.ఐ. మాట్లాడుతూ.... జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో అక్రమ, అసాంఘిక కార్యక్రమాలపై నిఘా పటిష్టం చేసి, పక్కా సమాచారంతో దాడులు నిర్వహిస్తున్నట్ల తెలిపారు.

## ద్విచక్ర వాహనం దహనం



ఎల్కతుర్తి జులై 13 ప్రజా మంటలు

ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామానికి చెందిన కెంసారపు శ్రీనివాస్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనాన్ని గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. అలాగే తన ఇంటి వద్ద పందుల కోసం వేసిన షెడ్యూల్ సైతం గుర్తు తెలియని వ్యక్తులు దానం చేసినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవల శ్రీనివాస్ కుటుంబ సభ్యులపై కేసు నమోదు కావడంతో పాటు కుటుంబ సభ్యులను పోలీసులు జైలుకు తరలించారు. ఇదే ఆధునిక భావించిన గుర్తు తెలియని వ్యక్తులు పాల్పడినట్లు బాధితులు తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



## కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

బీర్ పూర్ జులై 12(ప్రజా మంటలు)

మండల కేంద్రం లో రైతు వేదికలో మండలానికి చెందిన 20 మంది ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా మంజూరు అయిన 20 లక్షల రూపాయల విలువగల చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ .అనంతరం వన మహోత్సవం లో భాగంగా రైతు వేదిక ఆవరణ లో మొక్కలు నాటిన ఎమ్మెల్యే.వెంట కెడిసిసి జిల్లా మెంబర్ ముప్పాళ్ళ రాంచందర్ రావు,ఎమ్మార్వో నరేష్,ఎంపిడిఓ లచ్చులు,మాజీ సర్పంచులు,ఎంపీటీసీ లు,మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ ఎవ్వరికీ ఊరికే రాదు

ప్రతిభ ఎవ్వరికి ఊరికే రాదు...
ఎంతో సాధన...
మరెంతో తపన...
తెలుసుకోవాలనే కుతూహలం...
నేర్చుకోవాలనే అభిలాష ....
పట్టువదలని ప్రయత్నం...
నిరంతర కృషి...
గమ్యం దాటే పట్టుదల...
ఉంటే తప్ప...
ఎవ్వరికి ప్రతిభ సొంతం కాదు...
అందులో..
"హద్దులు లేని ప్రతిభ"
మనిషి తలుచుకుంటే
సాధ్యం కానిదేముంది... ?
హద్దులు లేని ప్రతిభ సొంతం
కావాలంటే
పగలు రేయి ఒకటే ధ్యాస
గురితప్పని ఏకాగ్రత
నిరంతర సాధన ప్రక్రియ ఉంటే
సాధ్యం కానిదంటు ఉంటుందా..
ప్రతిభలో ప్రావీణ్యత సాధించడా...
ప్రపంచ విజేత కాలేడా....
అందుకే...
ఓ.. యువతా..
మీరు అనుకుంటే సాధించలేనిది లేదు
సోమరితనం వదలండి
మీ మెదడుకు పదును పెట్టండి
హద్దులు లేని ప్రతిభ సొంతం
చేసుకోండి

రచన:
లగిశెట్టి ప్రభాకర్
జనగామజి
9441700316

# భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవిత ఖైదు

## రూ. 6500 జరిమాన

పెగడపెల్లి జులై 12 (ప్రజా మంటలు): ఐతిపల్లి పల్లి గ్రామానికి చెందిన గంగవ్వ కు కుమారుడు, కూతురు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగించేది గంగవ్వ కు తన భర్త రమేష్ కు మధ్య తరచూ గొడవలు జరిగేవి 2019 వ సంవత్సరంలో కన్న కొడుకు అయిన జలంధర్ ను హత్య చేసిన సంఘటన లో రమేష్ జైలుకు వెళ్లి బెయిలు పై బయటకు రావడం జరిగింది. జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత రమేష్ తండ్రి రాజమల్లు, మరియు రమేష్ తమ యొక్క వ్యవసాయ భూమిని సాగు చేయవద్దని ఒకవేళ సాగు చేసినట్లయితే గంగవ్వ ను వాళ్ళ కూతురు ను చంపుతామని బెదిరించసాగారు. తేది 18.12.2022 రోజున గంగవ్వ తన కూతురితో దోమలకుంట గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ భూమి లో వ్యవసాయ పనులు చేస్తుండగా అట్టి సమయంలో రమేష్ అక్కడికి వచ్చి గంగవ్వను కత్తితో పొడిచి చంపడం జరిగింది.మృతురాలి కూతురు 18 -12 -2022 తేదీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైమ్ నెంబర్ 218/2022, సెక్షన్స్ 302,307,109 %తీ/ః% 34 ఐ.పి.సి. చట్టం కింద పెగడపల్లి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయగా సర్కిల్ ఇన్స్పెక్టర్ రమణమూర్తి కేసును దర్యాప్తు చేయడం జరిగింది. శుక్రవారం పిపి, కోర్ట్ డ్యూటీ అధికారులు సాక్షులను ప్రవేశపెట్టగా సాక్షులను విచారించిన గౌరవ న్యాయమూర్తి ఎస్. నారాయణ నిందితుడు అయన నక్క రమేష్ పై నేరం రుజువు కాగా అతనికి జీవిత ఖైదు పాటు రూ. 6500 జరిమాన విదిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేస్ లో అడిషనల్ పీపీ గా మల్లేశం, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్ గా ఇన్స్పెక్టర్ రమణమూర్తి, సిఎంఎస్ ఎస్ఐ జి. రాజునాయక్, కానిస్టేబుల్ కిరణ్ కుమార్ మరియు కోర్టు కానిస్టేబుల్ సాగర్ నిందితునికి శిక్ష పడడం లో గౌరవ కోర్టుకు సాక్షాధారాలు అందించడంలో ప్రముఖ పాత్ర వహించడం జరిగింది. పై కేస్ లో నిందితులకు శిక్ష పడటంలో కృషి చేసిన పోలీసు అధికారుల ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

## పోలీస్ స్టేషన్ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### ధర్మపురి పోలీస్ స్టేషన్ అకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల జులై 12 (ప్రజా మంటలు)

పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం ధర్మపురి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు, వారు ఏ ఏ విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రాపర్ గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24%ఇ%7 గస్తీ నిర్వహించాలని , సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండాలని, తరచూ గ్రామాలను సందర్శించి సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాల పై, నూతన చట్ట ల పై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు.ఎస్పీ వెంట సీఐ రామ్ నరసింహారెడ్డి రెడ్డి,ఎస్.ఐ ఉదయ్ కుమార్ , మరియు సిబ్బంది పాల్గొన్నారు.



జగిత్యాల పట్టణంలోని కొత్త బస్ స్టాండ్ ముందు గల స్వాగత్ బార్ అండ్ రెస్టారెంట్ లో ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష తనిఖీలు. డీ ఫ్రిజ్ లో ఉంచిన మాంసం, అల్లం పేస్టు, పాడైన పదార్థాలని గుర్తించిన అధికారులు. వాటి శాంపిల్స్ లాబ్ కి పంపిన అధికారులు, పట్టణంలోని బార్ అండ్ రెస్టారెంట్ లు నిబంధనలు పరిశుభ్రత పాటించాలని అధికారి అనూష తెలిపారు.

# బిఆర్ఎస్ చీలిక.. కాంగ్రెస్‌లో చేరిక

**కెటిఆర్ లెక్కలోనే పార్టీ విలీనం**

**అసెంబ్లీ సమావేశాల నాటికి తతంగం పూర్తి**

**వేగంగా పావులు కదుపుతున్న సిఎం రేవంత్**






హైదరాబాద్, (ప్రజా మంటలు):
బిఆర్ఎస్‌ను దెబ్బతీయడం లక్ష్యంగా కాంగ్రెస్ పనిచేస్తోంది. నిస్సిగ్గుగా చేరికలను ప్రోత్సహించిన కెసిఆర్ సార్..ఇప్పుడు చేరికలపై గగ్గోలు పెడుతున్నారు. ఢిల్లీకి వెళ్లిన కెటిఆర్, హరీష్ రావులు అక్కడ చేరికలపై గగ్గోలు ప ఎట్టినా ఎవరు పెద్దగా పట్టించుకోలేదు. ఎందుకంటే అధికారంలోకి వచ్చిన రెండుసార్లు నిర్లజ్జగా కాంగ్రెస్, ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నారు. ఆనాడు లేని ఏడుపు ఇప్పుడెందుకు అన్నదే ప్రశ్న. అందుకే అధిరకారం పోవడంతో బీఆర్ఎస్‌కు షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే 14 మంది ప్రజాప్రతినిధులు పార్టీ మారగా... ఇప్పుడు మరికొందరు అదే లైన్‌లో ఉన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. శనివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ హస్తం గూటికి చేరనున్నారు. ఇదే బాటలో మరో ఆరేడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారనే టాక్ బలంగా వినిపిస్తోంది. పార్టీ నేతల వలస కట్టడికి బీఆర్ఎస్ అధినాయకత్వం చేస్తున్న కట్టడి ఎలాంటి ఫలితం ఇవ్వడం లేదు. ఫిరాయింపులు నిరోధించేందుకు కోర్టుల్లో పోరాటం, నేతలను బుజ్జగించేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఏవీ ప్రభావం చూపడం లేదు. ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న వారంతా ఇప్పుడు పార్టీ ఫిరాయించడానికి ఏ మాత్రం వెనుకడుగు వేయడం లేదు. తాజాగా గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి పరిధిలోని ఎమ్మెల్యేలంతా పార్టీ మారడానికి సిద్ధపడ్డట్టు వార్తలు వస్తున్నాయి. వచ్చే వారంలో రోజుల్లో వలస తీవ్ర మరింత ఎక్కువగా ఉంటుందని ఇరు పార్టీల నాయకులు అంటున్నారు. అంటే అసెంబ్లీ సమావేశాల్లోగా చట్టబద్దంగా ఎమ్మెల్యేల చేరికలు ఉంటాయి. పార్టీని చీల్చడం విలీనం చేయడం వంటివి జరుగుతాయని అర్థం చేసుకోవచ్చు. తాము చేర్చుకోలేదని, చట్టబద్దంగా విలీనం చేసుకున్నామని చెప్పిన కెటిఆర్‌కు ఘాటు సమాధానం ఇవ్వబోతున్నట్లుగా అర్థం చేసుకోవాలి. నీవు నేర్పిన విద్య నీరజాక్ష అన్న పద్దతిలో సాగుతున్నారు. ఇకపోతే బిఆర్ఎస్‌లో ఉండాలని ఎవరు కూడా కోరుకోవడం లేదు. నిరంకుశ నాయకత్వం ఉన్నచోట ప్రజాస్వామ్యం మనుగడ సాగించలేదు. అందుకే పార్టీ మారేందుకు నిర్ణయం తీసుకున్న ఎమ్మెల్యేలు తమ సన్నిహితులతో మాట్లాడుతున్నారు. కాంగ్రెస్‌లో చేరికకు ముహూర్తం ఖరారు చేసుకుంటున్నారు. ఇప్పటికే 7 ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు, ఒక ఎంపీ కాంగ్రెస్‌లో చేరారు. ఎంపీ స్థానానికి కేకే రాజీనామా చేయడం ఆమోదం కూడా జరిగిపోయింది. మిగతా వాళ్లు మాత్రం రాజీనామాలపై నోరు ఎత్తడం లేదు. ఈ మధ్య కాలంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ అధికార పార్టీ అక్రమంగా తమ ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను పార్టీలో చేర్చుకుంటుందని ఆరోపించారు. గతంలో తాము పార్టీ ఎల్పీలను మాత్రమే పార్టీలో విలీనం చేశామని ఎమ్మెల్యేలను చేర్చుకోలేదని అది ఫిరాయింపు కాదని అంటున్నారు. అదే సూత్రాన్ని కాంగ్రెస్ పాటించాలని ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. గతంలో 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున గెలిచిన ఎమ్మెల్యేల్లో 12 మందిని చేర్చుకొని సీఎల్పీని విలీనం చేసుకున్నారు. ఇప్పుడు అదే ఫార్ములాను రేవంత్ రెడ్డి ఫాలో అవుతున్నారని తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ 38 ఎమ్మెల్యేలను గెలిచింది. వీరిలో ఇప్పటికే ఏడుగురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇప్పుడు మరో ఆరేడుగురు పార్టీ మారేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలా 26 మందిని అంటే 2/3 వంతును కాంగ్రెస్‌లో చేర్చుకొని బీఆర్ఎస్ ఎల్పీని విలీనం చేయించాలని చూస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యే నాటికి పక్రియ పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారం కోల్పోయినప్పటి నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యేలు జంపింగ్ లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో చాలా మంది హస్తం గూటికి చేరేందుకు ప్రణాళికలు సిద్దం చేసుకుంటున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ స్పీకర్‌కు లేఖలు రాస్తూ, న్యాయస్థానాలను కూడా ఆశ్రయిస్తోంది. అయినప్పటికీ ఫిరాయింపుల పర్వం ఆగడం లేదు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్ రావు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి లాంటి కీలక నేతలు కూడా కాంగ్రెస్ పార్టీలోకి చేరిపోవడంతో బీఆర్ఎస్ కు భారీ షాక్ తగిలినట్లయింది. అలాగే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కూడా బీఆర్ఎస్ ను వీడారు. దీంతో సీనియర్ నేతలంతా కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడంతో బీఆర్ఎస్ క్యాడర్ క్రమంగా బలహీనపడుతున్నట్లు కనిపిస్తోంది. ఇదిలా ఉంటే మొన్న జరిగిన వైఎస్ఆర్ 75వ జయంతి సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంచలన కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ పార్టీని వీడి వెళ్లిన వారందరూ తిరిగి ఈ పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. దీంతో మరికొంత మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ఊతం ఇచ్చినట్లయింది. ఈ వ్యాఖ్యలు చేసి వారం కూడా కాకుండానే ఆరు మంది ఎమ్మెల్యేలు కారు దిగి కాంగ్రెస్ లోచేరుతున్నారంటే ఇది రాజకీయంగా పెను సంచలనమనే చెప్పాలి. అసెంబ్లీ సమావేశాల నాటికి బిఆర్ఎస్‌లో చీఇక..కాంగ్రెస్‌లో చేరిక ఖాయం కానుంది.

## మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ కుటుంబాన్ని ఆదుకుంటా

**సిఎం చంద్రబాబు నాయుడు హామీ**



అమరావతి,జూలై12 (ప్రజా మంటలు):
నక్సల్స్ చేతిలో హతమైన అరకు మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ కుటుంబ సభ్యులు సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా సోమ భార్య ఇచ్చావతి యోగక్షేమాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. సోమ కుమారుడి చదువు బాధ్యతను తాను తీసుకుంటానని చంద్రబాబు హామీ ఇచ్చారు. అంతకుముందు సీఎం సచివాలయానికి వెళ్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. సమస్యలతో వచ్చిన వారిని చూసి రోడ్డుపైనే కాన్వాయ్ ఆపారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకుని వినతులను స్వీకరించారు. వైకాపా గూండాల దాడిలో సర్వస్వం కోల్పోయానని.. ఆదుకోవాలని సీఎంను అరకు సర్పంచ్ శ్రీనివాస్ కోరారు. సమస్యను పరిష్కరిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు.

## అహంకారం అనర్థాలకు కారణం !

తిరుమల, జూలై12 (ప్రజా మంటలు):
అహం అన్నది మనిషజని దెబ్బతీస్తుంది. నేను అన్నదే పతనానికి నాంది. ప్రతి వ్యక్తీ గొప్పవాడు కావాలని కలలు కంటుంటాడు. ఇది సహజం. కానీ, అందరికన్నా గొప్పవాడు కావాలని కొందరు ఆరాటపడతారు. అలా కావటానికి చేతనైన అన్ని రకాల విధానాలూ అనుసరిస్తారు. అడ్డదారులు తొక్కుతారు. అవినీతికి సిద్ధపడతారు. అనాయాసంగా, నిస్సంకోచంగా అబద్దాలు ఆడతారు. కొందరు విశేషంగా ధనం సంపాదించి, తాము గొప్పవారమనే భ్రమతో గర్విస్తారు. మరికొందరు హోదా లభించగానే అధికార దర్పం, అహంకారం ప్రదర్శిస్తారు. ఇది కూడా ఆధిక్యతాభావం వల్లనే! కొందరు తమకంటే అందరూ తక్కువ స్థాయిలోనే ఉండాలని కోరుకుంటారు. తమకన్నా ఎవరు మించిపోతున్నా భరించలేరు. అసూయతో కుమిలిపోతారు. వారిమీద కక్షగా ఉంటారు. అవకాశం లభిస్తే, ఏదో విధంగా, తమకన్నా అధికులకు అపకారం చేస్తారు. వారికి కష్టనష్టాలు కలిగినప్పుడు, లోలోపల సంతోషపడుతూ, పైకి కపట సానుభూతి ప్రకటిస్తారు.దుర్యోధనుడికి సుయోధనుడు అనే మరొక పేరు ఉంది. నిజానికి అతడు అసూయాధనుడు. పాండవుల ఔన్నత్యాన్ని, ఆధిక్యతను సహించలేక పోతుండేవాడు. బాల్యం నుంచే పాండవుల పట్ల అసూయ, ద్వేషం కలిగి ఉండేవాడు. అసూయ అగ్ని వంటిది. ద్వేషమూ అంతే.ఏ కర్ర నిప్పు ఆ కర్రనే కాల్చినట్టు, ఎవరు అసూయాపరులో, వారినే అసూయాద్వేషాలు దహిస్తాయి. ఇది నిత్య సత్యం. అందుకే అహంకారం తలకెక్కకుండా చూసుకోవాలి. అప్పుడే పరిపూర్ణ మానవుడిగా ఎదుగుతారు.

# జగన్ మూర్ఖానికి మూల్యం చెల్లించుకున్న ఎపి

**అమరావతిని దెబ్బతీయడంతో ఆగిన అభివృద్ధి**

**పోలవరం ఆలస్యం కావడంతో పురుగతి వెనక్కి**

**మహిళా, యువశక్తి వినియోగంతో ముందుకు**

**చిట్‌చాట్‌లో చంద్రబాబు ఆవేదన**

విశాఖపట్టణం,జూలై12 (ప్రజా మంటలు):
సీఎం జగన్ ఒక మూర్ఖుడని.. రాజధాని అమరావతిని చంపేశారని టీడీపీ అధినేత, సిఎం చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. అమరావతి ఉండి ఉంటే చాలా అద్భుతమైన నగరంగా ఉండేదన్నారు. హైదరాబాద్‌ను ఆనాడు అభివృద్ధి చేసానని.. ఈ రోజు అది మహనగరంగా మారిందని చెప్పుకొచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తనను కలిసిన కొందరు మీడియా మిత్రులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం జగన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పోలవరం పూర్తి అయితే దక్షిణ భారత దేశంలో నెంబర్ వన్ అయ్యేదన్నారు. సంపద సృష్టించే అమరావతిని జగన్ చంపేశారు .. ఒకరి మూర్ఖత్వానికి–పిచ్చితనానికి రాష్ట్రం బలికావాలా? అని ప్రశ్నించారు.అమరావతిని రాజధానిగా ప్రకటించకముందు అక్కడ భూమి ధరెంత? రాజధానిగా కొనసాగి ఉంటే ఎంత ఉండేదో ఎవరైనా బేరీజు వేశారా? అని చంద్రబాబు ప్రశ్నించారు. జీవనాడి పోలవరాన్ని ముంచేస్తే, ప్రజల్లో చైతన్యం ఏమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా–గోదావరితో రెండు రాష్ట్రాల్లో ప్రతి ఎకరాకు నీళ్లివ్వొచ్చు ? భూ కబ్జాలు, సెటిల్ మెంట్లతో వేలకోట్లు దోచేశారు. రైతులు కోలుకోలేని దుస్థితిలో ఉన్నారు.. ఆత్మహత్యలు పెరిగాయి. కౌలు రైతులు పూర్తిగా నాశనమయ్యారని ఆరోపించారు. జగన్ మూర్ఖత్వానికి ఒక జాతి మొత్తం బలి అవ్వాలా అని ప్రశ్నించారు. జగన్ లాంటి వాడిని తన జీవితంలో ఎప్పుడూ చూడలేదన్నారు. భూముల సెటిల్‌మెంట్లు చేసి వేల కోట్లు సంపాదించారని ఆరోపించారు. ఋషికొండను కొట్టేసి బొడిగుండు చేశారన్నారు. కౌలు రైతులు పూర్తిగా నాశనము అయ్యారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పవర్ సెక్టార్‌లో రిఫార్మ్స్ తీసుకువచ్చి విజయం సాధించామన్నారు. భవిష్యత్‌లో ఫ్యూయల్, ఎనర్జీ సెక్టార్స్‌పై ప్రజల నుంచి తిరుగుబాటు వస్తుందన్నారు. సోలార్, విండ్, ఎనర్జీ సెక్టార్స్‌కు మంచి భవిషత్తు ఉంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. స్త్రీశక్తి , యువత దేశ వ్యాప్తంగా కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. భారత్ మినహా ప్రపంచ వ్యాప్తంగా యువత జనాభా తగ్గిపోతోందన్నారు. భారత్‌లో యువత జనాభా 2040 వరకు ఇబ్బంది లేదన్నారు. తల్లికి వందనం, ఆడ్డబిడ్డ నిధి, మహిళకు ఉచిత ప్రయాణం, ఉచిత గ్యాస్ మహిళల్లో ఆత్మగౌరవం నిలిపేందుకే ఈ పథకలు అని చెప్పుకొచ్చారు. తాను ఉమమడి ఎపిలో ఆ రోజు టెక్నాలజీ



అంటే నన్ను అందరూ ఎగతాళి చేశారు. ఈ రోజు అదే టెక్నాలజీ అందరికీ ఉపయోగ పడుతుందని అన్నారు. యువత శక్తిని ఉపయోగించి వారిని ముందుకు నడిపిస్తాం. కియా మోటార్స్ కేవలం తన క్రిడిబిలిటి వల్లనే వచ్చిందని.. ఐదేళ్లలో జగన్ ఒక బిల్డింగ్ కూడా కట్టలేదని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని వనరులు ఏపీలోనే ఉన్నాయన్నారు. పట్టిసీమ కడితే ఆనాడు ఎగతాళి చేశారని... మరి ఈ రోజు పట్టిసీమ లేకపోతే గోదావరితో కృష్ణా డెల్టాలను కాపాడే వారం కాదని అన్నారు. పోలవరాన్ని జగన్ పూర్తిగా ముంచేశారని విమర్శించారు. ప్రజలు ఇంకా చైతన్య వంతులు కావాలని పిలుపునిచ్చారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. దగాపడ్డ ఏపీ రాష్ట్ర ప్రయోజనాలే ఇప్పుడు నాకు ముఖ్యం. ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే నా లక్ష్యం. పెద్ద బాధ్యత నాపై ఉన్నప్పుడు పెద్ద ఆలోచనలూ అవసరం. రానున్న రోజుల్లో మిగతా దేశాల కంటే ఇండియా యువ భారత్ గా ఉంటుందన్నారు. చైనా అప్పట్లో తీసుకున్న విధానం వల్ల ఇప్పుడు సంపద ఉన్నా జనాభా పరంగా చైనా ఇబ్బంది పడుతోంది.. మనం కూడా జనాభా విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లల్ని బాగా చదివిస్తే వారు ప్రపంచానికి ఆస్తి అవుతారన్నారు. అందుకోసమే మేం తల్లికి వందనం కార్యక్రమం తీసుకు వచ్చాం తల్లికి, పిల్లలకు మధ్య అనుబంధాన్ని పెంచడానికి ఉపయోగ పడుతుందన్నారు. పూర్ టు రిచ్ అర్థం చేసుకోవడ కష్టమే..కానీ కష్టపడితే అద్భుత ఫలితాలు సాధ్యమని అన్నారు. పేదలకు ఇప్పుడు రోజుకు రూ.150 మాత్రమే వస్తోందని.. సంపద సృష్టి ద్వారా పేదరికం పోగొట్టాల్సి ఉందన్నారు. మహిళలకు వీలైనన్ని ఎక్కువ పథకాలకోసం ఆలోచిస్తున్నామన్నారు. మహిళల భాగస్వామ్యంతో కుటుంబం .. సమాజం బాగుపడేలా చూస్తామన్నారు. కట్టెల పొయ్యిపై మా అమ్మ పడిన కష్టాలు ఎన్నో చూశా.. మా అమ్మ కష్టాలు చూసే ఆనాడు దీపం పథకాన్ని తీసుకొచ్చామన్నారు.

# ఎపిలోనూ చేరికల రాజకీయం

**మండలిలో పట్టు సాధించేలా టిడిపి వ్యూహం**

**పార్టీలో చేరేందుకు పలువురు ఎమ్మెల్సీల ఆసక్తి**

**ఆచితూడి అడుగులు వేయాలన్న యోచనలో అధిష్టానం**




అమరావతి,జూలై12 (ప్రజా మంటలు):
ఎపిలోనూ చేరికల రాజకీయం మొదలయ్యింది. అసెంబ్లీ సమావేవాల కారణంగా మండలిలో పట్టు సాధించేలా టిడిపి వ్యూహం రచిస్తోంది. పార్టీలో చేరేందుకు పలువురు ఎమ్మెల్సీలు స్వచ్ఛందగా ఆసక్తి చూపుతున్నారు. అయితే ఆచితూడి అడుగులు వేయాలన్న యోచనలో అధిష్టానం ఉంది. రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయాన్ని సాధించిన తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో పూర్తిస్థాయి మెజారిటీతో కొనసాగుతోంది. శాసనసభలో ఏ బిల్లు అయినా సులభంగా పాస్ చేసుకునే బలం కూటమికి ఉంది. గత ఐదేళ్లు అధికారాన్ని అనుభవిం చిన వైసీపీ దారుణ పరాభవంతో 11 సీట్లకు మాత్రమే పరిమితమైంది. అయితే, వైసీపీకి శాసనమండలి లో మాత్రం బలం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఏవైనా కీలక బిల్లులను పాస్ చేయించుకోవాలంటే శాసనమండలిలో కూడా ఆమోదం తప్పనిసరి. ప్రస్తుత పరిస్థితుల్లో శాసనమండలిలో వైసీపీకి బలం ఉండడంతో అధికార కూటమి ప్రభుత్వానికి కొంత ఇబ్బంది తప్పదు అన్న విశ్లేషణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కూటమి నేతలు శాసనమండలలోనూ బలం పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్న పలువురు ఎమ్మెల్సీలపై టిడిపి దృష్టి సారించినట్లు తెలుస్తోంది.అయితే, ఎమ్మెల్సీలను పార్టీలో చేర్చుకునే విషయంలో తెలుగుదేశం పార్టీ ఆచితూచి వ్యవహరిస్తోంది. గడిచిన ఐదేళ్లలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై తీవ్ర స్థాయిలో వ్యాఖ్యానించిన, ఇబ్బందుల కు గురి చేసిన వారి విషయంలో మాత్రం తెలుగుదేశం పార్టీ కఠినంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అటువంటి నాయకులను పార్టీలో చేర్చుకునేందుకు చంద్రబాబు కూడా ఆసక్తి చూపించడం లేదని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే తాజాగా వైసీపీలో ఎమ్మెల్సీలుగా ఎన్నికై ఎన్నికల సమయంలో ఆయా స్థానాలకు రాజీనామా చేసి పలువురు టిడిపిలో చేరారు. వీటిలో రెండు స్థానాలకు కొద్ది రోజుల కిందట అధికారులు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. అయితే, వైసీపీ నుంచి అభ్యర్థులెవరు నామినేషన్ దాఖలు చేయకపోవడంతో టిడిపి నుంచి సిరామచంద్రయ్య, జనసేన నుంచి హరిప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గడిచిన ఐదేళ్లు అధికారం ఉన్నప్పటికీ తమను కనీసం పట్టించుకోలేదన్న భావన చాలా మంది ఎమ్మెల్సీలలో ఉంది. అటువంటి వారంతా ఇప్పుడు అధికార తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అటువంటి వారిపైన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి చేర్చు కునేందుకు ఆలోచన చేస్తున్నట్లు చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీలుగా ఉన్నప్పటికీ కనీసం గౌరవం, గుర్తింపు దక్కకపోవడం పట్ల అవమాన భారంతో ఉన్న పలువురు ఎమ్మెల్సీలు ప్రస్తుత అధికార తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సంసిద్ధులవుతున్నారు. ఈ క్రమంలోనే తమకు సన్నిహితంగా ఉండే మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా టిడిపిలో చేరేందుకు రాయబారాలను పంపుతున్నారు. ఇప్పటికే పలువురు ఎమ్మెల్సీలు ఈ మేరకు ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రులను కలిసి తమ ఆసక్తిని తెలియజేస్తున్నారు. ఇప్పటికే ఐదుగురు ఎమ్మెల్సీలు తెలుగుదేశం పార్టీకి చెందిన కీలక నేతలు, మంత్రులను కలిసి మాట్లాడినట్లు చెబుతున్నారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం ఇటీవల రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అధికారంలో ఉన్న ఐదేళ్లు తమకు ప్రాధాన్యం ఇవ్వలేదని, ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి ఉద్ధరించామన్నట్టుగా చూశారని ఓ ఎమ్మెల్సీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించడం గమనార్హం. అధికారంలో ఉన్నంతకాలం జగన్ తమతో ఒక్కసారి కూడా ప్రత్యేకంగా కూర్చుని మాట్లాడిన దాఖలాలు లేవని అసంతృప్త ఎమ్మెల్సీలు ప్రస్తావిస్తున్నట్లు చెబుతున్నారు. ఇటీవల ఎన్నికల్లో ఘోర పరాజయం తరువాత మాత్రమే జగన్ తమతో ప్రత్యేకంగా మాట్లాడినట్లు పలువురు పేర్కొంటున్నారు. ఇప్పుడు కూడా తమ అవసరం వచ్చింది కాబట్టి పిలిచారని, అది కూడా తమ గురించి కాకుండా మండలిలో తన కోసం నిలబడాలని చెప్పినట్లు పలువురు ఎమ్మెల్సీలు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం ఐదుగురు ఎమ్మెల్సీలు తమకు తెలిసిన మంత్రుల ద్వారా టిడిపిలో చేరేందుకు రాయబారాలు నెరపుతున్నారు. ఇదే ఆలోచనలో మరింత మంది ఎమ్మెల్సీలు ఉన్నట్లు చెబుతున్నారు. కొంతమంది టిడిపి మంత్రుల ద్వారా పార్టీలో చేరేందుకు అవకాశం కల్పించాలంటూ కోరుతున్నారు. మరి కొంతమంది వచ్చి కలుస్తామంటూ మంత్రులకు వర్తమానాన్ని పంపిస్తున్నారు. అదే సమయంలో వైసీపీ మద్దతుతో గెలిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీల్లో కూడా ఇద్దరూ తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో టచ్ లోకి వెళ్లినట్లు చెబుతున్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TEL-TEL01938. FILE NO.1349985 PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com